POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
ఫిబ్రవరి 2025
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 42 సంచిక: 10



## పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మహరాజ్
## బ్రహ్మానుభూతి దినోత్సవము

(09.02.2025) ~ (13.02.2024 తిథి)

శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము, గుమ్మళంపాడు గ్రామంలో జరుగు
పూజ్యశ్రీ అలివేలుమంగా సమేత భరద్వాజ మహరాజ్ లీలా కళ్యాణ మహోత్సవ వేడుకలు.
మార్చి 5, 6,7,8 మరియు 9 తేదీలు - 2025

# కార్యక్రమ వివరములు

## మార్చి 5, 2025, బుధవారం

**ఉదయ కార్యక్రమములు**

గంll 5:30 - పూజ్యశ్రీ మాస్టరుగారికి మరియు పూజ్యశ్రీ అమ్మగారికి మేలుకొలుపు సేవ,
విడిది గృహమునకు ఆహ్వానించుట.
గంll 6:00 - శ్రీ సాయిబాబా కాకడ ఆరతి.
గంll 7:30 - పూజ్యశ్రీ అమ్మగారి సమాధి అభిషేకము, ప్రత్యేక అలంకరణ.
గంll 8:30 - అల్పాహార నైవేద్య సేవ.
గంll 9:00 - ప్రసాద వితరణ.
గంll 10:00 - **పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారిని వరునిగా, పూజ్యశ్రీ అమ్మగారిని వధువుగా చేయుట,
వారి పాదుకలకు పంచామృతాలతో అభిషేకము,వేద పారాయణ, వస్త్ర సమర్పణ, మంగళ హారతులు.**
గంll 12:00 - మధ్యాహ్న ఆరతి.
గంll 12:30 - మహా నివేదన,
తదనంతరము ప్రసాద వితరణ.

**సాయంకాల కార్యక్రమములు**

గంll 4:00 - పూజ్యశ్రీ సాయిబాబాకు, పూజ్యశ్రీ మాస్టరుగారికి, పూజ్యశ్రీ అమ్మగారికి మరియు మహాత్ములకు
కాఫీ నివేదన.
గంll 5:00 - **పూజ్యశ్రీ భరద్వాజ మహరాజ్, పూజ్యశ్రీ అలివేలు మంగమ్మల ఎదురుకోలు మహోత్సవము,
వరపూజ, లగ్నపత్రిక.**
గంll 7:00 - **గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారితో సద్గోష్ఠి.**
గంll 9:00 - శేజ్ హారతి.
గంll 9:30 - ప్రసాద వితరణ.

## మార్చి 6, 2025 గురువారం

**ఉదయ కార్యక్రమములు**

గంll 5:30 - పూజ్యశ్రీ మాస్టరుగారికి మరియు పూజ్యశ్రీ అమ్మగారికి మేలుకొలుపు సేవ,
గంll 6:00 - శ్రీ సాయిబాబా కాకడ ఆరతి
గంll 7:30 - పూజ్యశ్రీ అమ్మగారి సమాధి అభిషేకము, ప్రత్యేక అలంకరణ.
గంll 8:30 - అల్పాహార నైవేద్య సేవ.
గంll 9:00 - ప్రసాద వితరణ.
గంll 10:00 - **శ్రీ సాయినాథుని సన్నిధిలో, మహాత్ముల సమక్షంలో, వేద మంత్రాలతో,
పూజ్య గురు దంపతుల లీలా కల్యాణ మహోత్సవ వైభవము.**
గంll 2:00 - భోజన ప్రసాద వితరణ

*(మిగతా వెనుక కవర్ పేజీలో)*

# నిత్యజీవితంలో ధర్మాధర్మాలను నిర్ణయించడం ఎలా?

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

మన సమాజంలో అతి చిత్రము, దురవగాహమూ అయిన అంశాలలో వర్ణవ్యవస్థ ప్రధానమైనది. ఒక వంక అది ఆర్షమూ, వైదికమూ కనుక ఎట్టి పరిస్థితులలోనూ వర్ణభేదాన్ని పాటించి తీరాలని చెప్పేవారు కొందరు. అది మానవత్వానికే కళంకమని, ప్రకృతిలో అన్ని విధాలా సమానులైన మనుషుల మధ్య అగాధమైన భేదాన్ని సృష్టించి హిందూ సమాజాన్ని ఛిన్నాభిన్నం చేసినదనీ, కనుక దానిని ఎంత త్వరగా రూపుమాపితే అంతమంచిదనీ తలచేవారూ వున్నారు. ఈ రెండు దృక్పథాల మధ్యా అనిశ్చింతలో వూగిసలాడే వారెందరో! 'ఎవరిష్టం వారిది!' అని సమాధానపడడానికి వీలులేని అంశాలు యిందులో యిమిడి యుండడంచేత. యిరుపక్షాలతో రాజీపడదలచినవారికి జీవితంలో ప్రతి చిన్న సందర్భంలోనూ అంతస్సంఘర్షణ తప్పదు.

స్వధర్మాన్ని విడనాడితే యిక పారమార్థిక వికాసమే వుండజాలదన్న శాస్త్రవాక్యాలు ఒక వంక కళ్ళెర్రజేస్తుంటే, ఏ కారణంగానైనా సాటి మానవుణ్ణి అవమానంగా చూడడం సమర్థనీయంగాదన్న అంతఃకరణ బోధ పిడికిలి బిగిస్తుంది. ఈ సమస్యను పరిష్కరించుకోనంతసేపు ఏ పని చేసినా ఆ అంశం మేరకు శంక మిగిలివుండి చిత్తశుద్ధి లోపిస్తుంది. అంతకంటే మనిషికి బలహీనత యింకొకటి వుండదు. అది ఆత్మవిశ్వాసానికే తీరని దెబ్బ!

ఈ సమస్యకు పరిష్కారం అనుకొన్నంత కష్టం గాదు. ధర్మానికంతటికీ మూలమైన మనుస్మృతి యిలా చెబుతుంది.

**శ్లో॥ శ్రుతిః స్మృతిః సదాచార**
**స్వస్యచ ప్రియమాత్మనః।**
**ఏతచ్చతుర్విధం ప్రాహుః**
**సాక్షాద్ధర్మస్య లక్షణమ్॥** **(2:12)**

తా॥ "శ్రుతి, స్మృతి, సత్పురుషుల ఆచరణ, ఆత్మసంతుష్టి యీ నాలుగూ ధర్మం యొక్క లక్షణాలని పెద్దలు చెబుతారు "

శ్రుతి అంటే వేదాలు, స్మృతి అంటే ధర్మశాస్త్రాలు, సదాచారమంటే సత్పురుషుల ఆచరణ విధానం. చివరిది ఆత్మ సంతృప్తి ఒక పని ధర్మబద్ధమైనదేనన్నది.

మొదట వేదం ఒక విషయంలో నిర్ణయమేమి చేసిందో అర్థమవ్వాలి. దాని కనుగుణంగా స్మృతి ఆ విషయంలో చెప్పినది తెలియాలి. ఇవి రెండూ సామాన్యుల కర్థమయ్యేవిగావు. కనుక సత్పురుషుల ఆచరణ విధానాన్ని బట్టి మొదట రెండింటినీ తెలుసుకోవచ్చు. అలాంటివారు మనకర్థం కాని దానిని వాచా వివరించగలరుగూడ – యుద్ధరంగంలో అర్జునుడికొచ్చిన సందేహాన్ని, శ్రీ కృష్ణుడు తీర్చినట్లు.

ఇన్నీ వున్నా కూడా చివరి అంశమైన ఆత్మసంతృప్తి కూడా వుండాలి. అందుకే మనుస్మృతి యిలా అంటుంది

**శ్లో॥ సర్వంతు సమవేక్ష్యేదం**
**నిఖిలం జ్ఞాన చక్షుషా।**
**శ్రుతి ప్రామాణ్యతో**
**విద్వాన్ స్వధర్మ నివిశేత వై॥** **(2:8)**

తా॥ "ఈ ధర్మశాస్త్రాన్నంతటినీ వివేకి తన జ్ఞాన

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:42 ఫిబ్రవరి - 2025 సంచిక:10

**పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"**

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | **నిత్యజీవితంలో ధర్మాధర్మాలను నిర్ణయించడం ఎలా?** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | **పరిప్రశ్న** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 03. | **మాస్టరుగారు** | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 08 |
| 04. | **మాతృదేవి స్మృతులు** | శ్రీమతి షర్మిల | 12 |
| 05. | **వార్తాలాపము** | శ్రీమతి అడిదం వేదవతి | 15 |
| 06. | **బుద్ధ ధ్యాన హృదయము** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 17 |
| 07. | **భగవాన్ శ్రీ భరద్వాజ** | శ్రీమతి శ్రీదేవి | 19 |
| 08. | **శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు** | శ్రీమతి శ్రీదేవి | 22 |
| 09. | **ద్వారకామాయి అనుభవమండపము** | శ్రీమతి రామరాజు శిరీష | 25 |
| 10. | **ఆచార్యుని అద్భుత లీలలు** | శ్రీ వెంకట రమణయ్య | 27 |


**చిరునామా**

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
**www.saibharadwaja.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

**చందా వివరములు**

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

నేత్రంచేత పరిశీలించి యిది వేద ప్రామాణికమని తెలిసి ఆచరణ కుపక్రమించాలి.”

అంటే తాను చేసే పని వేద ప్రామాణికమన్న ఆత్మసంతృప్తికరమైన విశ్వాసం కల్గితేనే ఆచరించాలి. కారణం అలాటి విశ్వాసానికి బదులు శంకతో, సందేహంతో, అసంతృప్తితో, విముఖతతో ఆచరించినది ధర్మం కావడానికి వీలులేదు. ఒక్క ఉదాహరణ– ఒక పేదవాడికి దయతో యిచ్చినది దానమవుతుందిగాని, రేపు ఎన్నికలలో వాడు ఓటు వేస్తాడనో, లేకుంటే వాడు సాటివారితో ముఠాకట్టి రేపు మనకెదురు తిరుగుతాడనో భయపడి యిచ్చింది దానం కాదు గదా! ధర్మానికి భావం మూలం. అందుకే శ్రీ కృష్ణుడుగూడ భగవద్గీతలో అనేకసార్లు ధర్మసూక్ష్మం వివరించాకగూడ అర్జునుడితో “యథేచ్ఛసి తథాకురు” చివరికి “నీకేది నచ్చితే అదే చేయి” అంటారు. అంటే కృష్ణుడు చెప్పినది ధర్మబద్ధమన్న విశ్వాసముంటేనే అది చేయడం వలన ఫలితముంటుంది.

ఈ విషయంలో సామాన్యులకు శ్రుతిని, స్మృతిని జ్ఞాన చక్షువుతో పరిశీలించడం సాధ్యమవదు. అపుడు కర్తవ్యం సదాచారమే! అంటే సత్పురుషుల అచరణే. దీని ప్రాధాన్యత తెలియడానికే పైన ఉటంకించిన మొదట శ్లోకంలో మనువుగూడ చివరికి “ప్రాహుః”, “తెలిసిన పెద్దలు చెబుతారు” అన్నాడు. అతడికి గూడ అదే ప్రమాణమన్నమాట.

ఇక ఆత్మవేత్తల సదాచారమే శ్రుతి, స్మృతులకు వివరణ అన్న అంశాన్ని మరింత స్పష్టంగా మనువిలా సూచించాడు.

**భూతానాం ప్రాణినః శ్రేష్ఠాః ప్రాణినాం బుద్ధిజీవినః ।**
**బుద్ధిమత్సు నరాః శ్రేష్ఠాః నరేషు బ్రాహ్మణా స్మృతా॥**
**బ్రాహ్మణేషుచ విద్వాంసో విద్వత్సు కృతబుద్ధయః ।**
**కృతబుద్ధిషు కర్తారః కర్తృషు బ్రహ్మవేదినః ॥**

***(1:97,98)***

తా॥ “సృష్టించబడిన వాటన్నింటిలో ప్రాణులు, వాటిలో బుద్ధిగల జీవులు, బుద్ధిజీవులలో నరులు, నరులలో బ్రాహ్మణులు, బ్రాహ్మణులలో విద్వాంసులు, వారిలో శాస్త్రోక్తానుష్ఠానమందు బుద్ధిగలవారు, అట్టి వారిలో అనుష్ఠించువారు శ్రేష్ఠులు. వీరందరిలో బ్రహ్మవేత్తలు శ్రేష్ఠులు”

అంటే వీరే శ్రుతి స్మృతుల సారాన్ని బోధించగల వారిలో ఉత్తములన్నమాట. వారిమాటా, ఆచరణా ధర్మానికి ప్రమాణాలు. ఇందుకు మరొక కారణం గూడ వున్నది. బ్రహ్మవేత్తలు సర్వకాలాలలోనూ వుంటారు. ఆయా దేశకాల స్థితులలో ఉత్తమమైన ధర్మాన్ని ప్రజలకు లభింపజేయడానికి అవసరమైన, సాధ్యమైన రీతిన ఆచరణకు మార్గము తెల్పుతారు. తదితరులైన మానవులు రెండు రకాలుగా వుంటారు. మారుతున్న దేశకాల పరిస్థితులలో ప్రాచీన కర్మకాండను నిర్దుష్టంగా ఆచరించ సాధ్యంగాక దానిని విడిచిపెట్టడమన్నా చేస్తారు. లేక అప్రధానమైన బాహ్యాచారానికి మూఢంగా అంటిపెట్టుకొని దాని అంతర్యాన్ని కోల్పోతారు. ఉదాహరణకు పైన ఉటంకించిన “సర్వంతు సమవేక్ష్యేదం” అన్న శ్లోకాన్ని యిట్టివారు విస్మరిస్తారు. దీనికి ఉదాహరణ: ధర్మశాస్త్రంలో యుద్ధానికి పిలువబడ్డ రాజుయొక్క ధర్మం స్పష్టంగా వున్నా దానిని మరచి అర్జునుడు అధర్మాన్ని పరమధర్మంలా భగవద్గీత మొదటి అధ్యాయంలో వల్లించడం చూస్తాము. అలాటి పరిస్థితులలో ధర్మస్వరూపాన్ని సమగ్రంగా ఎఱిగిన బ్రహ్మవేత్త ధర్మసూక్ష్మం విచ్ఛిన్నంగాకుండా ఆచరణను ఎలా మలచుకోవాలో శ్రీ కృష్ణుడు బోధించినట్లు బోధిస్తాడు. అందుకే అట్టివారిని ముముక్షువు ఆశ్రయించితీరాలని శ్రీ కృష్ణుడు భగవద్గీత అధ్యాయం 4, శ్లోకం 32లో చెప్పాడు. రాముడు తాటకి స్త్రీ అని వెనుకాడుతుంటే సర్వధర్మజ్ఞుడైన విశ్వామిత్రుడు కర్తవ్యాన్ని బోధించాడు. సామాన్య శ్రోత్రీయులు తలచినంత తేలికగాదు ధర్మనిర్ణయం. దానిని నిర్దుష్టంగా చేయగలగాలంటే భగవద్గీతలో దైవీసంపద, సాత్విక లక్షణాలుగా చెప్పబడిన సద్గుణాలన్నీ వుండాలి. అవి బ్రహ్మవేత్తలకు గాని వుండజాలవు.

కనుక యీకాలంనాటి మనం మొదట ప్రస్తావించిన ధర్మసందిగ్ధమైన జీవితాంశాల విషయంలో యీనాటి బ్రహ్మవేత్తలైన శిరిడీ సాయిబాబా, శ్రీ అక్కలకోట స్వామి, శ్రీ గజానన్ మహరాజ్, శ్రీ రమణ మహర్షి, శ్రీ రామకృష్ణ పరమహంస వంటి వారు సూచించిన మార్గాన్నే నడవాలి.

***మిగతా 07వ పేజీలో***

# పరిప్రశ్న

***పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ***

***ప్రశ్న :- నన్ను చిన్నప్పటినుంచి మా బావకిచ్చి వివాహం చెయ్యాలనుకున్నారు. అతడే నాభర్త అన్న భావం నాలో నాటుకుపోయింది. కాని కట్నానికాశించి మా అత్త అతడికి మరో అమ్మాయినిచ్చి వివాహం చేసింది. ఎన్నిరోజులు గడిచినా నా భావం మారటంలేదు. ఆత్మహత్యకు ప్రయత్నించి విఫలమయ్యాను. నేను వివాహం చేసుకోకుండా జీవితాన్ని మాధవ సేవకు అంకితం చేయాలనుకుంటున్నాను. మీ సలహా కావాలి.***

***- ఒక సోదరి, రాజమండ్రి***

**జవాబు :-** పెద్దలు అవివేకంతో పిల్లల మనసులలో ఆశలు కల్పించడం, తర్వాత పరిస్థితులు అనుకూలించక పిల్లల జీవితాలు భగ్నమవడం చాలా దారుణం. నీ పరిస్థితి అర్థమైంది. నీ నిర్ణయం చాలా మంచిది. ధర్మమంతటికీ మూలం హృదయం. అది లోపించిన ధర్మం వంచన. భగవంతుడు ధర్మానికి నిలబడే ఆత్మస్థైర్యం నీకిచ్చాడు, ఇస్తాడు.

అయితే నీవుకూడా ఆలోచించవలసిన సూక్ష్మమొకటున్నది. నీకీ భావం కల్గడం పెద్దలు ముందుచూపు లేకుండా తొందరపడి ఆశలేర్పరచుకొని, నీకు కల్పించడం, అది వారి అజ్ఞానమే గాని కుట్రగాదు గదా. కాకుంటే మీ బావకు పూర్వజన్మ ఋణానుబంధం వలన మరొక అమ్మాయితో వివాహమైంది. దానికి వారు కర్తలు కారు. మీ అత్తయినా ఆ కర్మ సూత్రానికి పనిముట్టు మాత్రమే. అతడిని ఆమె గర్భాన జన్మింపచేసినది ఋణానుబంధమే; ఆమె వైపు నుంచీ చూస్తే ప్రతి తల్లి లాగే తన కొడుకుకు అంత ఆర్థిక వున్నతిని కోరిందేగాని మరేమున్నది? అలాగాక మీమీది అయిష్టంతో కూడా అలా చేసిందనుకుందాము. అలాంటి అయిష్టం గూడ పూర్వ ఋణానుబంధం వలననే కలుగుతుంది. కనుక మానవులెవరూ కర్తలని భ్రమించి వారిపై మనస్సులో ద్వేషం పెట్టుకోవద్దు. అందువలన మన మనస్సు మలినమై వారిపై పగ తీర్చుకోడానికి మరలా జన్మించేలా చేస్తాయి. దాని పర్యవసానంగా ఆ పై జన్మలో నిష్కారణంగా మనం వారిచేత హింసించబడాలి. ఆ వలయానికి అంతం లేదు. ఇంకా ఇంకా దుఃఖవలయాల సుడిగుండంలోకి జీవులు లాగబడతాయి. దానినే మాయ అంటారు. ద్వేషమొక మాయా బంధమయితే మమకారం మరొక బంధం. ఒకే

అజ్ఞానమనే కాసు యొక్క బొమ్మ బొరుసు ఇవి.

పోనీ నీ బాధకు భగవంతుడు కారణం అందామా అంటే ఆయనకు మనపై పగ ఎందుకు ? అపారమైన ప్రేమ వుంటుంది. అందుకే ఆయన మనకు యోచనాశక్తి, వివేకమూ యిచ్చారు. మనకు తెలియనివి తెల్పే శ్రీసాయిబాబా, రామకృష్ణపరమహంస, మహమ్మద్, బుద్ధుడు వంటి మహాత్ములను పంపాడు. వారి ద్వారా భగవద్గీత, బైబిల్, ఖరాను వంటి గ్రంథాలనిచ్చాడు. వీటిని లెక్కచేయక మన యిష్టాలలో తగుల్కొని కల్పించుకొన్న ఋణానుబంధానికి ఆయనేమి చేస్తాడు? పోనీ విడిపించకూడదా అంటే ముందుగా టీచర్ ఎంతైనా మనపట్ల అధిక శ్రద్ధగా చదివించగలడు గానీ, మార్కులు అన్యాయంగా వేసి మనను కృతార్థులను చేయగూడదు కదా ? అలా కొందరికే చేస్తే తక్కిన అందరి పట్ల ద్రోహి అవుతాడు ఆయన. అందరిపట్ల ఆయన అలానే చేస్తే ఇక పిల్లలు చదివి బుద్ధి వికాసం చెందేదెప్పుడు? ఎలా? పిల్లల మనస్సులు హింసించి వారు స్వతంత్రులు, ఉత్తములు గావాలన్నది ఆయన సృష్టియొక్క ఇతివృత్తం. ఋణానుబంధంగా అనివార్యంగా వచ్చే అనుభవాలను ఆశ నిరాశలు లేకుండా అంగీకరించి, వాటిని సాధ్యమైనంత సమర్థవంతంగా మలచుకొంటూండడం, జీవిత సమాప్తి లోగా మన జ్ఞానాన్ని పెంపొందించుకొంటూండడం, పూర్ణమైన దుఃఖరాహిత్యాన్ని అంటే భగవదనుగ్రహాన్ని పొందడం – ఇదే మన కర్తవ్యం.

ఆత్మహత్య సమస్యను తీర్చదు. శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర, శ్రీ స్వామి సమర్థ చరిత్రలకు తోడు అవధూత చివటంఅమ్మ చరిత్ర చదువు. ఎందరెందరి జీవితానుభవాలనో చూస్తే మనకెన్నో తెలుస్తాయి. అసలైన విద్య అది. ఆత్మహత్యతో సమస్యను తప్పుకోజూస్తే పరీక్ష వ్రాయలేక ప్రశ్నపత్రంతో పారిపోజూచిన విద్యార్థిలా, న్యాయబద్ధంగా విధించబడిన శిక్షను తప్పించుకోజూచిన నేరస్తునిలా – మరలా జన్మించి ఈ బాధను అనుభవించే తీరాలి. సరిగదా ఆత్మహత్య దోషానికి అదనంగా శిక్ష అనుభవించాలని ఆ మహనీయులు స్పష్టంగా చెప్పారు.

నిజానికి మన శరీర మనస్సులు మనకు చెందవు. మనం సృష్టించలేదు. వాటి వయః పరిమాణాన్ని ఆపలేము. ఒక నాటికి మృతి చెందకుండా కాపాడలేము. అవి ఒక స్థాయిలో ఋణానుబంధానికి చెందినవి. ప్రవాహంచేత అలల వలె ఋణానుబంధంచేత ఆయా అనుభవాలను పొందేతీరాలి. మరొకలా చూస్తే దైవం మనకిచ్చిన తెప్ప, తెడ్డులాంటివి. ఈ అజ్ఞాన సముద్రాన్ని దాటి శాశ్వతమైన ఈ ఆనందరూపుడైన ఆయనను చేరడానికి యివ్వబడ్డాయి. ఆ పనిచేయక మనం వాటితో ఆడుకోవడం మొదలు పెడతాము. మన అవివేక పర్యవసానాలే మనను దండిస్తాయి. కనుక ఆలోచిస్తే గత సంఘటనలకు భావాలుగా, స్మృతులుగా తప్ప వాస్తవికత లేదు. ఇకనైనా జ్ఞానంతో ఆలోచించి, జ్ఞానాన్ని పెంపొందించుకో, కొంతకాలమయ్యాక ఆలోచించుకోవచ్చు. స్థిమితం చిక్కాక మరలా వ్రాయి. ●

## నిత్యజీవితంలో ధర్మాధర్మాలను నిర్ణయించడం ఎలా ?

05వ పేజీ తరువాయి

అటు అల్పజ్ఞులైన మూఢాచారపరాయణులు చెప్పినట్లుగాదు, యిటు సర్వాచార భ్రష్టులైన స్వేచ్ఛాజీవులు చెప్పినట్లుగాదు. కేవల బాహ్యాచార రీతులే ధర్మమనుకుంటే కొన్ని సమాధానంలేని ప్రశ్నలెదురవుతాయి. ప్రాచీన హిందూ ఆచారకాండే పరమార్థానికి మార్గమనుకొంటే అందుకు వ్యతిరేకంగా కనుపించే ఆచారంగల యితర మతాలలో వెలసిన సిద్ధపురుషులెలా పూర్ణత్వాన్ని చెందగల్గారు? ఆయా మతాలవారు వారి ఆచారాలే దివ్యాదేశాలని, అవి మాత్రమే శ్రేయస్కరమనీ నమ్ముతున్నారు. వారి అభిప్రాయాలే నిజమైతే మన ధర్మంలో అవతరించిన మహనీయుల మాటేమిటి? ఇలా యింకెన్నో! ఈ వైవిధ్యం చూస్తూంటే విజ్ఞాన శాస్త్ర ప్రభావానికి గురవుతున్న మన యువతరానికి ఏ ధర్మం సత్యమో ఎలా నిర్ణయించాలన్నది అర్థం కాదు. అంత విరుద్ధంగా కన్పించే ఆయా మత ధర్మాలన్నీ ఎలా సత్యాలవడం సాధ్యమన్నది అర్థంగాదు. అసలు మతాలే మూఢ విశ్వాసాలేమోనన్న అభిప్రాయం ధృవపడుతుంది వారికి. ఇలాటి పరిస్థితులలో ముముక్షువులందరూ బ్రహ్మవేత్తలైన సిద్ధపురుషుల మార్గాన్ననుసరిస్తే యీ సమస్య పరిష్కారమవుతుంది. ●

(ఫిబ్రవరి 2013 సాయిబాబా మాసపత్రిక నుండి)

# మాస్టరుగారు

## *పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ*

విశాల విశ్వం! అందులో కోటానుకోట్ల నక్షత్ర గ్రహగోళాలు! ఎంత పరిశోధించినా ఇంకా ఎంతో తెలుసుకోవలసి వున్న చిత్ర విచిత్ర సృష్టి రహస్యాలు!! ఈ విశ్వం ఒక అక్షయ, అనంత, అద్భుత, విజ్ఞాన భాండాగారం! ఎవరు ఏ కోణంలో పరిశోధిస్తే ఆ కోణంలో కనిపించే గారడీ ప్రదర్శన (మ్యాజిక్ షో)!!

అందులో అనంతకోటి జీవరాశి! అనుక్షణం గణాంకాలకు అలవిగానన్ని జీవుల జనన మరణాలు!!

ప్రతి జీవికీ 'నేను' అనే స్ఫురణ వున్న భావన! ఆ భావనవలన సృష్టిలో నిరంతరమూ జరిపే స్పందనలు – ప్రతిస్పందనలు!!

రోజులు, మాసాలు, సంవత్సరాలు, శతాబ్దాలు, యుగాలు, కల్పాలు – ఇలాగే కొనసాగుతున్న సృష్టి క్రమం!

అలాగే కొనసాగుతున్నా నిన్నటి రోజు ఈ రోజు ఎప్పటికీ కాదు, ఈ రోజు రేపు ఎన్నటికీ కాలేదు. ఇలా గతాన్ని తిరిగి ఇవ్వలేని కాలగతి!


ఇంతటి విశ్వంలోనూ అతి చిన్నది అయిన భూమి మీద ఎన్నో కోట్ల కోట్ల, కోట్ల కోట్ల – ఇలా అంతులేని కోటానుకోట్ల భాగమైన అతి చిన్న చలన జీవి మానవుడు!

కానీ ఈ సృష్టిలోని ఏ జీవికీ లేని – మానవునికి మాత్రమే వున్న విశిష్టత – మనస్సు!

ఈ మనసున్న మనిషికి ఎన్నో ఆలోచనలు! ఎన్నో బంధాలు! ఎన్నెన్నో సంబంధాలు!! వాటి వల్ల కలిగే రాగ ద్వేష కామ క్రోధ  అసుయాది భావాలు! వాటి వల్ల కలిగే సుఖదుఃఖాలు!

వాటితో అతలాకుతలమయ్యే మానవ జీవితాలు!!

ప్రతి మానవునికి ఏదో పొందాలన్న తపన! పొందలేక పోతున్నామన్న ఆవేదన! అందువలన కలిగే అశాంతి!



ఏమిటి ఈ మానవ జీవితం? ఈ జీవితాలు యిలా గడవవలసినదేనా? దీనికి అంతమెక్కడ?

ఈ రహస్యాన్ని ఛేదించాలనుకునేవారు కొందరు. సాధించి మహాత్ములుగా రూపొందినవారు ఏ కొద్దిమందో! అట్టివారే పూజ్యశ్రీ మాస్టరుగారు.

అంతా నశించిపోయేదే అయినప్పుడు ఈ తాపత్రయమేమిటి? మరణించిన తర్వాతది తెలియనప్పుడు మమకారాలెందుకు? అసలీ సృష్టి రహస్యమేమిటి? మానవజీవిత రహస్యమేమిటి?

దీనికొక అర్థము, లక్ష్యము వున్నాయా?

ఇలాంటి ప్రశ్నలతో పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధానాల కోసం అన్వేషించారు. సాధించారు. పరిష్కార మార్గాలు గూడ తెలుసుకున్నారు. పరమశాంతిని పొందారు.

అంతటితో ఆగక ఆయన తాము పొందిన ఆనందాన్ని అందరూ పొందాలని ఆరాటపడ్డారు. వారు ఆ మార్గాల గురించి, కర్తవ్యాల గురించి అనేక విధాలుగా బోధిస్తూ వుండేవారు.

అలా పూజ్యశ్రీ మాస్టరుగారు బోధించిన ప్రవచనాలలో కొన్నింటిని గూర్చి క్లుప్తంగా స్మరించుకుందాము.

1. "పరిశోధించు; సాధించు"
2. "విశ్లేషించు; వివేచించు"
3. "పరిశీలించు; విశ్వసించు"
4. "శరణుపొందు; సేవించు"
5. "శ్రమించు; పంచు"
6. "ఆచరించు; బోధించు"
7. "ప్రేమించు; క్షమించు"

వీటిని గురించి పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా వివరిస్తూ వుండేవారు.

## "పరిశోధించు; సాధించు"

దేనిని గురించియైనా నిశితంగా, నిష్కర్షగా పరిశోధించు. దాని తత్త్వాన్ని గురించి లోతుగా ఆలోచించు. అప్పుడు దాని తత్త్వం అవగతమవుతుంది. అయితే ఏ విషయాన్నైనా క్షుణ్ణంగా తెలుసుకోవడానికి పట్టువిడవకుండా ప్రయత్నించాలి. మూలాన్ని తెలుసుకోవాలి. మూలాన్ని తెలుసుకున్నట్లు గుర్తు ఏమిటంటే ఆ విషయంలో ఇక సందేహముండదు. మనస్సు శాంతిని పొందుతుంది.

## "విశ్లేషించు, వివేచించు"

జీవితంలో జరిగే సంఘటనల గూర్చి విశ్లేషించు. అంటే సంఘటనలలోని, పరిస్థితులలోని మంచిచెడులు, పూర్వాపరాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలి. తర్వాత వివేకంతో ఆలోచించాలి. అంటే వాటిలోని సత్యాసత్యాలను గూర్చి నిష్కర్షగా, స్వార్థ రహితంగా ఆలోచించాలి. అప్పుడే సరియైన అవగాహన కలుగుతుంది. సరియైన నిర్ణయాలు తీసుకోగలుగుతాము గూడ.

## "పరిశీలించు; విశ్వసించు"

ఈ విషయమై ఆయన ఒకసారి ఇలా చెప్పారు. "జన్మనెత్తినందుకు గురువును తెలుసుకోవాలి. లేకపోతే ఎందుకు వచ్చినట్లు? పిడకలు ఏరుకోడానికా?" అని బాబా చెప్పారు. కనుక మానవజన్మనెత్తినందుకు తప్పకుండా గురువును తెలుసుకోవాలన్నమాట.

అయితే గురువును తెలుసుకునేదెలా? అందుకు మొదట సద్గురువులు ఎలా వుంటారో, వారి లక్షణాలేమిటో సంపూర్ణంగా తెలుసుకోవాలి. అట్టి లక్షణాలు అవతలి వ్యక్తిలో, అంటే, గురువుగా పెట్టుకోవాలి అనుకునేవారిలో వున్నాయో లేదో నిశితంగా పరిశీలించాలి. ఎన్ని విధాలుగానైనా అట్టివారిని పరీక్ష చేసుకోవచ్చు. అందుకు ఎంత కాలమైనా తీసుకోవచ్చు. మనం దేనినైనా – అంటే కూరగాయలనైనా సరే – కొనడానికి వెళ్లినప్పుడు అవి సరియైనవి అవునో కాదోనని ఎంతగానో పరీక్షిస్తాము గదా! అలాగే ఒక పెళ్లి సంబంధం చూడాలంటే ఎంతగానో అవతలివారి వివరాలు గూర్చి విచారిస్తాము గదా! అలాంటప్పుడు మన జీవితాన్నే సద్గురువుకు అప్పగించాలని తలచినప్పుడు

ఎంతగానో పరిశీలించవలసిన అవసరమున్నది. అందుకని అప్రమత్తతతో, క్షుణ్ణంగా, అనుమానం లేని విధంగా పరీక్షించిన తర్వాతనే ఎవరినైనా గురువుగా ఎన్నుకోవాలి.

అయితే సరియైన గురువును ఎన్నుకోవడానికి మన పరిజ్ఞానం చాలదు గనుక సద్గురువు లభించాలని 'శ్రీగురు చరిత్ర' శ్రద్ధగా పారాయణ చేస్తే శ్రీ దత్తాత్రేయుడు స్వప్నదర్శనమిచ్చి నిజమైన సద్గురువును మనకు తెలుపుతారు. అప్పుడు, అట్టి గురువును ఆశ్రయించడం సరియైన పద్ధతి. సద్గురువును తెలుసుకున్న తర్వాత, వారిని తన గురువుగా భావించిన తర్వాత ఆయనను సంపూర్ణంగా విశ్వసించాలి. కానీ తగిన పరిపాకం లేకపోవడం వల్ల గురువును సంపూర్ణంగా విశ్వసించలేకపోతాము. అందుకని గురువు ఎంతటివాడో గుర్తుపెట్టుకుని మనస్సును సడలకుండా జాగ్రత్త వహించాలి. ఆయన సర్వజ్ఞుడనీ, సర్వ సమర్థుడనీ, మన ఐహిక ఆధ్యాత్మిక శ్రేయస్సు చేకూర్చేవారనీ సంపూర్ణంగా విశ్వసించాలి.

## "శరణు పొందు; సేవించు"

గురువును తెలుసుకున్న తర్వాత వారిని శరణు పొందాలి. ఆయనే సర్వస్వము అనే భావనలో ఆయనకు సేవ చేసుకోవాలి. ప్రాపంచిక జీవితంలో వున్నవాళ్ళు తమ బాధ్యతలను గురుసేవగా భావించాలి. ఆయన వాటిని తమకే అప్పగించిన బాధ్యతలుగా, ఆయన ఆజ్ఞగా భావించి కర్తవ్యాలను నిర్వర్తించాలి. అప్పుడు గురుసన్నిధిలో సేవ చేసినట్లే అవుతుంది. కారణం ఆయన ఎక్కడ లేరు గనుక? అదే సేవ చేయడమంటే! నిష్ఠ సబూరీలనే దక్షిణలను ఆయనకు సమర్పించి దక్షతతో సేవ చేసుకోవాలి.

## "శ్రమించు; పంచు"

"కష్టపడి పనిచెయ్యి, దేవుని నామముచ్చరించు" అన్నారు బాబా. అందుకని ప్రథమ కర్తవ్యంగా ప్రతి మానవుడూ కష్టపడి పని చెయ్యాలి. బాబా చెప్పిన ఈ సూక్తిలో ఎంతో అర్థమున్నది. కష్టపడి పనిచేయడం వల్ల కర్మ నశిస్తుంది. పుణ్యం లభిస్తుంది. ఋణ విముక్తి కలుగుతుంది. పనిచేయడం తన కోసం మాత్రమే గాక ఇతరుల కోసం గూడ చేయాలి. అంతేగాక తాను సంపాదించిన దానిలో ఇతరులకు గూడ వినియోగిస్తూ వుండాలి.

భగవంతుడు మనకు సర్వాన్నీ ప్రసాదిస్తున్నాడు. ప్రకృతి తన సర్వస్వాన్నీ మనకు యిస్తున్నది. సూర్యచంద్రాదులు, పశుపక్ష్యాదులు, వృక్షాలు, నదులు - అన్నీ మనకు తమకంటూ ఏమీ మిగుల్చుకోకుండా దానం చేస్తున్నాయి. అలాగే మానవుడు గూడ ఇతరులకు సాధ్యమైనంతగా యివ్వడం నేర్చుకోవాలి. ఇది మానవుని కనీస కర్తవ్యం.

## "ఆచరించు; బోధించు"

ప్రతి మానవుడూ ధర్మాన్ని ఆచరించాలి. ప్రాపంచిక విషయంలోగానీ, పారమార్థిక విషయంలోగానీ ధర్మాచరణ అత్యంత ప్రధానమైనది. ధర్మం తాను ఆచరిస్తూనే ఇతరులకు బోధించాలి. తాను ఆచరించకుండా బోధిస్తే అది 'దంత వేదాంతము' అవుతుంది.

ధర్మం మీదనే శాంతి భద్రతలు ఆధారపడి వున్నాయి. ఈనాడు ఇంతగా విజ్ఞానం పెంపొందినా, దాని ద్వారా ఎన్నెన్నో సౌకర్యాలు, సౌలభ్యాలు లభించినా ధర్మాచరణ లోపం వల్ల ఇంకా ఇంకా మానవులు అశాంతికి గురి అవుతున్నారు.

ఒకనాడు ఎక్కడికైనా వెళ్లాలంటే పాదచారులుగానే వెళ్లవలసివుండేది. తర్వాత క్రమంగా సౌకర్యాలు వచ్చి దేశ విదేశాలకు గూడ త్వరగా వెళ్లగలుగుతున్నాము. ఆనాడు వార్తలు చేరవేయడానికి మనుషులు కాలి నడకన, లేక గుర్రాల మీద వెళ్లవలసి వుండేది. ఈ రోజు ఫోను సౌకర్యంతో ఎక్కడి నుంచి ఎక్కడికైనా మాట్లాడుకోవచ్చు. ఇలా ఈనాడు సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయి అన్ని విషయాలలోనూ అతి సులభమైన మార్గాలు కనుగొనడం జరుగుతున్నది. అందువలన మానవులకు ఎంతో శ్రమ తగ్గుతున్నది. సమయము కలిసి వస్తున్నది. అయినా

నేడు శాంతిగా వుండలేకపోతున్నాము. అనుక్షణము అభద్రతాభావం పెరిగిపోతున్నది. ఈ విషయం గూర్చి నిశితంగా ఆలోచించవలసిన అవసరమున్నది. దానికి కారణం ధర్మాచరణ లోపమేనని చెప్పక తప్పదు. నేడు చాలామందిలో భక్తి మేల్కొంటున్నది. చాలామంది ఏదో ఒక దైవాన్నో లేక గురువులనో సేవిసున్నారు. కానీ ఎక్కువ మందిలో ధర్మాచరణలోపం స్పష్టంగా కనిపిస్తున్నది.

చివరకు 'వంతులకు, కీచులాటలకూ పోవద్దు', అని చెప్పిన బాబాను సేవించేవారిలో ఎంతో మందిలో గూడా ఈ లోపం వల్ల వంతులు, కీచులాటలు, విభేదాలూ చోటు చేసుకుంటున్నాయి. కొన్ని చోట్ల రాజకీయం తాండవిస్తున్నది. చాలా చోట్ల గూడా స్వార్థం కనిపిస్తున్నది. అందువలన అవతలివాడికి అపకారం చేయాలనే దుష్టతలంపులు చోటు చేసుకుంటున్నాయి.

వారు బాబా భక్తులే. బాబా ధ్యానము, పూజ, జపము, సేవలు బాగా చేస్తారు. తమకున్న వాటిని బాబాకు సమర్పించడానికి వెనుకాడరు. కానీ సాటివారి పట్ల వారి ప్రవర్తనలో మార్పు వుండదు. భేద భావము, స్వార్థము ప్రతిస్పందిస్తుంటుంది. ఉదాహరణకు ఒకడు మందిరాలలో జరిగే అన్నదానాలకు ఎంతైనా డబ్బు ఖర్చు పెడతాడు. బిచ్చగత్తెకు భిక్షమెయ్యడు. పేదవారికి సహాయం చేయడు. దీనిని బాబా హర్షించరు. హీన దీనుల సేవ ఆయన స్వయంగా చేసి చూపించారు. పేదసాదలకు ధనం యివ్వడం చేసి చూపించారు. ఇలాంటి ఎన్నో లోపాలు బాబా భక్తులలో గూడ కొందరికి వుండడం విచారకరమైన విషయం. అందుకనే ధర్మాచరణ అత్యంత ప్రధానమైనది. ప్రతి మానవుడూ ధర్మమాచరిస్తూ ఇతరులకు బోధిస్తూ వుండాలి. అప్పుడే మనం సుఖశాంతులతో వుండగలము.

## "ప్రేమించు; క్షమించు"

సకల జీవులలోనూ ఆత్మయే వున్నదనిగానీ, భగవంతుడే వున్నాడనిగానీ భావించినప్పుడు అందరినీ ప్రేమించగలుగుతాము. అలాగాక సకల జీవులూ తనవంటి ప్రాణులే అనుకున్నప్పుడు గూడ అసూయా ద్వేషాలు కలుగవు. ప్రేమించడమే జరుగుతుంది.

బాబా తాము అన్ని ప్రాణులలోనూ వున్నట్టు చెప్పడమేగాక అట్టి అనుభవాలను ప్రసాదించారు గూడా. అట్టి భావన నిలుపుకున్నప్పుడు గూడా అందరినీ ప్రేమించడం సాధ్యమవుతుంది.

సాటి మానవులు గూడా తమ వంటి బలహీనతలు గలవారే అనుకున్నప్పుడు వారి యొక్క స్వభావాలను గూడా పట్టించుకోక ప్రేమించడం జరుగుతుంది. ఒక్క మానవులేగాక ఇతరములైన వాటిని గూర్చి వాటి తత్వములను గూర్చి ఆలోచించినప్పుడు గూడ సకల జీవులనూ ప్రేమించడం సాధ్యమవుతుంది.

అప్పుడు ఎవరియందూ, లేక వేటియందూ వున్న బలహీనతలు, లోపాలు లోపాలుగా కనిపించక ఎవరు ఎలా ప్రవర్తించినా క్షమించడమే జరుగుతుంది.

అలాగాక మన జీవితాలలోని ప్రతి సంఘటననూ బాబాయే ప్రసాదిస్తున్నారని తలచినప్పుడు గూడ అవతలివారిని క్షమించడం జరుగుతుంది.

పూజ్యశ్రీ మాస్టరుగారు ఈ విధంగా మన శ్రేయస్సుకోసం ఎన్నో ముఖ్యమైన సూచనలు చెప్తుండేవారు. ఆయన ఒక్కొక్క విషయాన్ని గూర్చి ఎంతగానో వివరించేవారు. ఆయన చెప్పిన వాటిలో కొన్నింటిని క్లుప్తంగా మాత్రమే మనమిప్పుడు స్మరించుకున్నాము.

ఈ కృతజ్ఞతా మహోత్సవ సందర్భంగా పూజ్యశ్రీ మాస్టరుగారు ప్రవచించిన అమూల్య సూక్తులను విశ్లేషించుకుని, వివేచించి ఆచరించడానికి ప్రయత్నిద్దాము. సమర్థ సద్గురువులైన పూజ్యశ్రీ మాస్టరుగారిని శరణు పొంది, విశ్వసించి, సేవిద్దాము .

ఇటువంటి సద్గురువును, తన ముద్దుబిడ్డను మనకు ప్రసాదించినందుకు సమర్థ సద్గురువులైన శ్రీ శిరిడీ సాయినాథునికి వందన సహిత కృతజ్ఞతలు తెలుపుకుందాము.

జై సాయి మాస్టర్ !

# మాతృదేవి స్మృతులు

శ్రీమతి షర్మిల, హైదరాబాదు

పూజ్యశ్రీ అలివేలు మంగమ్మతల్లి లీలావైభవాన్ని హైదరాబాదుకు చెందిన శ్రీమతి షర్మిలగారు ఈవిధంగా తెలియజేస్తున్నారు.

నేను 2010లో పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన 'శ్రీ గురుచరిత్ర' గ్రంథము మొదటిసారి పారాయణ చేసినప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి కొంచెం తెలిసింది. తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారి వెబ్‌సైట్‌లో వున్న గ్రంథాలన్నీ చదివాను. అప్పటినుంచి నా వ్యక్తిత్వంలో చాలా మార్పు వచ్చింది.

తర్వాత మేము మావారి ఉద్యోగరీత్యా కువైట్ వెళ్ళిపోయాము. మళ్లీ 2018లో పిల్లల చదువుకోసం హైదరాబాద్ వచ్చాము. అప్పుడు మా కుటుంబమంతా నాగోలు నిలయానికి వచ్చాము. ఆరోజు గురుపూర్ణిమ. నాకు అడ్రస్ తెలియకపోవడం వల్ల నాగోలుకు వెళ్లి రావడంలో చాలా ఇబ్బంది పడ్డాం. దాంతో మావారు, "నువ్వు ఇంట్లోనే పూజ చేసుకో! ఆశ్రమాలకోసం అంతంత దూరం వెళ్ళొద్దు" అని చాలా ఖచ్చితంగా చెప్పి కువైట్ వెళ్లిపోయారు. మాది రాజస్థానీ సాంప్రదాయం. ఇంట్లో ఎవరికీ పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి ఏమాత్రం తెలియదు. నాకు మాత్రం వారు దత్తస్వామి! మా కుటుంబ సంప్రదాయాన్ని అనుసరించి మేము కొన్ని పూజలు చేసుకునేవారము. నేను మాత్రం శ్రీ గురుచరిత్ర గ్రంథం పెట్టి, ఆ గ్రంథం పూజ్యశ్రీ మాస్టరుగారి స్వరూపంగా భావించి పూజలు చేసేదాన్ని. మావారు గాని, మా కుటుంబసభ్యులు గాని చూసినప్పుడు తీసి దాచేసేదాన్ని.

2013 తర్వాత శ్రీ సాయిలీలామృతం లక్షపారాయణ యజ్ఞం సందర్భంగా శ్రీమతిసులోచనగారితో పరిచయం ఏర్పడింది. అప్పటినుంచి నాకు ఏ సమస్య వచ్చినా ఆవిడకి ఫోన్ చేసి చెప్పేదాన్ని. మా ఇంట్లో ఏర్పడిన చాలా పెద్ద ఆర్థిక సమస్య గురించి సులోచనగారి ద్వారా పూజ్యశ్రీ అమ్మగారికి తెలియజేస్తే, నన్ను శ్రీ సాయిలీలామృతం ఏడుసార్లు పారాయణ చేయమన్నారు. అయితే పట్టుదలగా చేయలేకపోయాను. తరువాత మావారు కువైట్ నుంచి ఇండియాకు వచ్చేశారు. అప్పుడు ఆ పరిస్థితులు తట్టుకోలేక మళ్ళీ పూజ్యశ్రీ అమ్మగారికి సమస్య విన్నవించుకుంటే మావారిని శ్రీగురుచరిత్ర సప్తసప్తాహాలు పారాయణ చేయమన్నారు. మావారికి నమ్మకం లేకున్నా నా వత్తిడివల్ల, పరిస్థితుల ప్రభావంవల్ల పారాయణ మొదలుపెట్టారు. ఆశ్చర్యం! ఏడు పారాయణలు పూర్తిచేసే లోపలే పరిస్థితి అంతా చక్కబడి సమస్యలన్నీ తొలగిపోయాయి! మావారు చాలా ఆశ్చర్యపోయారు! ఇంత తక్కువ సమయంలో అంత పెద్ద సమస్య తొలగిపోయేలా పరిష్కారం సూచించిన వారు సామాన్యులు కారని, సాక్షాత్తు భగవంతుని స్వరూపమేనని అర్థమై ఆయనకు పూజ్యశ్రీ అమ్మగారి మీద నమ్మకం కలిగింది.

అలాగే మా పెద్దమ్మాయి సి. ఏ. రెండుసార్లు పరీక్ష

తప్పింది. మూడోసారి పరీక్షకు వెళ్ళాలంటే కూడా భయపడేది. అప్పుడు నేను పూజ్యశ్రీ అమ్మగారికి మా అమ్మాయి పరీక్ష గురించి సులోచనగారి ద్వారా విన్నవించుకున్నాను. పూజ్యశ్రీ అమ్మగారు ఆశీస్సులిచ్చారు. మా అమ్మాయి ఆ సంవత్సరం సి.ఎ.లో చాలా మంచి మార్కులతో ఉత్తీర్ణురాలైంది! దానివల్ల మా పెద్దమ్మాయికి కూడా పూజ్యశ్రీ అమ్మగారంటే చాలా నమ్మకం ఏర్పడి పారాయణ చేయడం మొదలుపెట్టింది.

అప్పటినుంచి అప్పుడప్పుడు మావారు, నేను కలిసి నిలయానికి వెళ్లేవారము. 2022లో మొట్టమొదటిసారి పూజ్యశ్రీ మాస్టరుగారి జయంతికి మా భార్యాభర్తలిద్దరం నిలయంలో పూజ చేసుకున్నాము. ఆరోజు రుద్రాభిషేకం కూడా జరిగింది. మా ఆనందానికి అవధులు లేవు.

ఒకసారి నిలయంలో సేవ చేసే రమాదేవిగారు, "నేను అమెరికా వెళ్తున్నాను. మూడు నెలలు రాను. మీరు మధ్యాహ్నం నివేదన సేవ చేసుకోగలరా?" అని అడిగారు. "అలాగేనండి, తప్పకుండా చేసుకుంటాను" అని చెప్పాను. అలా మధ్యాహ్నం సేవ చేసుకునే అవకాశం లభించింది. ఆ సమయంలో మావారు వేరే ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నారు. అప్పుడు నేను, "ఇంత మంచి అవకాశం మళ్లీ మనకు రాదు. మూడు నెలల కోసమే మనకు ఈ సేవ ఇచ్చారు.కనుకతరువాతఉద్యోగప్రయత్నాలుచేసుకోవచ్చు, మనిద్దరం వచ్చి చక్కగా అమ్మగారికి సేవ చేసుకుందాం!" అని చెప్తే సరేనని ఒప్పుకున్నారు. అప్పటినించి హబ్సిగూడా నించి ప్రతిరోజు ఇద్దరం మధ్యాహ్న హారతి ముందుగా వచ్చి నిలయం చుట్టూ ఊడ్చుకోవడం, మొక్కల పని ఏదైనా వుంటే చేయడం వంటి సేవలు చేసుకుంటాము. ఇలా చేస్తున్నప్పుడు మా మనస్సులో చాలా మంచి భావాలు కలుగుతుండేవి. పూజ్యశ్రీ అమ్మగారు అక్కడ ప్రత్యక్షంగా వున్నారని చాలాసార్లు అనుభవమయ్యేది.

నిలయంలో ముందు అందరూ శుభ్రం చేస్తారు, వెనుక పక్క సందు ఎవరూ శుభ్రం చేయరు., అది కూడా నిలయంలో భాగమే కదా అని నేను అక్కడ రోజూ శుభ్రం చేసేదాన్ని. ఒకసారి మన సత్సంగసభ్యులొకరు ఆ సందు శుభ్రం చేయవద్దనేసరికి ఆ రోజంతా చాలా బాధపడ్డాను. మరునాడు నిలయానికి వెళ్ళాక మధ్యాహ్న హారతి పెట్టి బయట కూర్చున్నాను. రోజూ ఆ సమయంలో ఆ పక్క సందు శుభ్రం చేసేదాన్ని. మనసంతా బాధగా వుంది అప్పుడే ఒక అద్భుతం జరిగింది.

ప్రతిరోజూ నాగోలు బయటవుండే ఒక సత్సంగసభ్యుడు మధ్యాహ్నం నివేదన సమయంలో దర్శనానికి వచ్చేవారు. నివేదన తరువాత సరిగ్గా రెండు గంటలకు సత్సంగహాలు మూసివేయాలని అక్కడి నియమం. ఇతను ప్రతిరోజూ చాలా ఆలస్యంగా వచ్చి రెండు గంటలు అవుతున్నా బయటకు వచ్చేవారు కాదు. ఆరోజు మధ్యాహ్న హారతి అవుతుంటే అతను వచ్చి బయట కూర్చున్న నాతో, "మీరు పక్కన సందు శుభ్రం చేశారా?" అని మొట్టమొదటిసారి చాలా మర్యాదగా అడిగారు!! "నన్నేనా?!" అని ఆశ్చర్యంగా చూస్తూ, "లేదండి!" అన్నాను. "ప్రతిరోజూ మీరు ఆ ప్రదేశాన్ని చక్కగా శుభ్రం చేస్తున్నారు. మీరు తప్పకుండా ఈ సేవ చేసుకోవాలి!" అని చెప్పి, హారతి అవ్వగానే నమస్కారం చేసుకుని వెళ్లిపోయారు! నేను, మావారు చాలా ఆశ్చర్యపోయాము. ఎందుకంటే ప్రతిరోజూ అతను వచ్చేసరికి ఆ సేవ అయిపోతుంది. నేను చేస్తున్నట్టు కూడా అతనికి తెలియదు. ఈరోజు తొందరగా రావడమే కాక ఎంతో మర్యాదగా ఆ సేవ చేసుకొమ్మని చెప్పారు!! అది పూజ్యశ్రీ అమ్మగారి అనుమతిగా భావించి మహాప్రసాదంగా ఆ రోజునుంచి ఆ సేవ చేసుకుంటున్నాను.

ఒకామె అప్పుడప్పుడు నిలయానికి వస్తుంటారు. ఒకరోజు ఆవిడ, "మాస్టరుగారి దగ్గరున్న మంచినీళ్లు తాగొచ్చా?" అని అడిగి, లోపలకు వెళ్లారు. మావారు ఆమె వెనకేవెళ్లి మేము తెచ్చుకున్న నీళ్లు ఆమెకు ఇస్తూ, "పూజ్యశ్రీ మాస్టరుగారికి పెట్టిన నీళ్ళు మనం తాగకూడదు కదండీ!" అన్నారు. ఆమె, "నేను అలా అనలేదు. నీళ్లు తాగొచ్చా?" అని అడిగానన్నారు. మావారు నాతో, "నీకేమని వినిపించింది?" అని అడిగారు. "మాస్టరుగారికి పెట్టిన నీళ్లు తాగొచ్చా?" అని వినిపించింది అంటూ, పీఠం వైపు చూశాను. ఆశ్చర్యం!! పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గర, పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర మంచి నీళ్ళు పెట్టలేదు! రోజూ ఉదయం హారతి తరువాత ఆ సేవ చేస్తారు. నేను ఇంతసేపూ గమనించనేలేదు. ఇది తెలియచేయడానికే పూజ్యశ్రీ అమ్మగారు ఈ లీల చేశారనిపించింది.

నేను ప్రతిరోజూ నివేదన సమర్పించిన తరువాత కొన్ని పళ్ళు పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర పెట్టేదానిని. ఒకరోజు నా మనసులో, "రోజూ నేనే తెస్తున్నాను, ఇంకెవరూ తేవటం

లేదు!" అన్న భావన వచ్చింది. ఇలా మనసులో భావన వచ్చిన కాసేపటికి ఎవరో ఒక ఆవిడ బుట్టనిండా చాలా రకాల పళ్ళు తీసుకొచ్చి అక్కడ పెట్టేసి వెళ్ళిపోయింది! ఇంకొక ఇద్దరు నాగోలు వాళ్ళు వచ్చి తలొక డజను అరటిపళ్ళు తెచ్చి అక్కడ పెట్టి వెళ్ళిపోయారు! కొంతసేపటికి నాగోలు బయట వుండే ఒక అమ్మాయి వచ్చి కొన్ని అరటిపళ్ళు ఇచ్చేసి వెళ్లిపోయింది! నాకు చాలా ఆశ్చర్యమేసింది. కాసేపట్లో ఎన్ని రకాల పండ్లు వచ్చాయో చెప్పలేను! అప్పుడు అర్థమైంది... నా ఆలోచన ఎంత తప్పో! నన్ను సంస్కరించడానికే పూజ్యశ్రీ అమ్మగారు ఆ లీల చేశారని స్పష్టంగా తెలిసి మనస్ఫూర్తిగా క్షమాపణ వేడుకున్నాను.

మరునాడు నేను చివరిగా వచ్చిన అమ్మాయిని అడిగాను, "నిన్న ఎందుకు అరటిపళ్ళు తెచ్చావు?" అని! నేను ఆఫీసు పని చేసుకుంటుంటే పూజ్యశ్రీ అమ్మగారు గుర్తొచ్చారు! వెంటనే నిలయానికి వెళ్లాలనిపించింది. అప్పటికప్పుడు అరటి పళ్ళు కొని తీసుకొచ్చాను!" అని చెప్పింది. మన మనసులోని ప్రతి ఆలోచనా పూజ్యశ్రీ అమ్మగారికి తెలుస్తుందని అప్పుడు అర్థమైంది. ఇక ఎప్పటికీ నేను చేస్తున్నాననే భావన రానివ్వకూడదని నిర్ణయించుకున్నాను.

మేము శిరిడీకి వెళ్లి చాలాకాలం అవ్వడంతో ఈసారి ఎలాగైనా వెళ్లాలని టిక్కెట్లు రిజర్వు చేసుకుని రమాదేవిగారితో, "రేపటినుంచి నాలుగురోజులు రాను. శిరిడీకి వెళ్తున్నాను" అని చెప్పాను. ఆమె, "నేను కూడా వూళ్ళో వుండటం లేదు. అత్యవసరపని మీద మా ఊరికి వెళ్లాలి. ఇక్కడ కూడా ఎవరికీ కుదిరేటట్టు లేదు. నువ్వు కొన్నిరోజుల తరువాత వెళ్లవచ్చు కదా!" అన్నారు. నేను, "ఇప్పటికే రెండు, మూడు సార్లు రద్దయింది. ఈసారి తప్పక వెళ్లాలి!" అని చెప్పి మా ఇంటికి వచ్చేశాను.

ఆరోజు రాత్రి ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో నేను, మా అమ్మాయిలు గుమ్మళంపాడులో పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధానానికి బయలుదేరాము. ఆ స్వప్నంలో కూడా మా అలవాటు ప్రకారం మేము అద్దంకిలో దిగి, జగదీష్ మురారిగారి ఇంటికి వెళ్లి, అక్కడ స్నానాదులు ముగించుకుని, పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధానానికి వెళ్ళాము. చిత్రంగా అక్కడికి వెళ్ళగానే పూజ్యశ్రీ అమ్మగారి సమాధి వున్న ప్రాంతమంతా ద్వారకామాయిగా మారిపోయింది! నాకు మెలకువ వచ్చింది. అప్పుడు నాకు, "నా దగ్గరికి వస్తే శిరిడి వెళ్లినట్లే!" అని పూజ్యశ్రీ అమ్మగారు చెప్పక చెప్పారనిపించింది. వెంటనే టికెట్లు రద్దు చేసుకుని నిలయంలో సేవకు వెళ్లిపోయాను.

2024 మే చివర్లో మా కుటుంబమంతా శిరిడీకి వెళ్ళాము. అక్కడ బాబా దర్శనానికి వెళ్ళినప్పుడు మధ్య వరుసనుంచి (పాదుకలు వైపు, తల వైపు కాకుండా) దర్శనం జరిగింది. నేను బాబా ఎదురుగా నిల్చుని పూజ్యశ్రీ మాస్టరుగారు బాబాను ఎలా చూసివుంటారో అనుకుని కళ్ళల్లో కళ్ళు పెట్టి చూశాను.

కొన్ని నిముషాలకు బాబా కళ్ళు పూజ్యశ్రీ అమ్మగారి కళ్ళల్లాగా మారిపోయాయి!! తరువాత బాబా స్థానంలో నిలయంలో చిత్రపటంలో ఎలా వుంటారో అలా అదే చీరతో పూజ్యశ్రీ అమ్మగారు కూర్చుని దర్శనమిచ్చారు!! కొంతసేపటికి స్పృహ వచ్చి మావాళ్ళ కోసం చూశాను. ఎవ్వరూ కనిపించలేదు. బయటకు వచ్చి వాళ్ళతో, "ఎందుకు వచ్చేశారు?" అనడిగితే, "నువ్వు అక్కడ అరగంట సేపు వున్నావు. అక్కడ అందరినీ పంపించేస్తున్నారు చెప్పారు! 'అంతసేపు వున్నానా?' అని ఆశ్చర్యపోతూ, మావాళ్ళతో నాకు జరిగిన అనుభవం చెప్తే అందరూ చాలా ఆనందించారు.

2010లో నాకు నిలయం ఎలా వుంటుందో కూడా తెలియని రోజుల్లో స్వప్నంలో నిలయంలో ఇప్పుడు పూజ్యశ్రీ అమ్మగారి చిత్రపటం వున్న స్థానంలో బాబా కుర్చీలో కూర్చుని దర్శనమిచ్చారు! పీఠం మీద దత్తస్వామి, పూజ్యశ్రీ మాస్టరుగారి పటాలున్నాయి. స్వప్నంలో నేను నిలయంలోకి వెళ్ళగానే బాబా కుర్చీలోనుంచి లేచి నాతో మాట్లాడారు!

సమర్థ సద్గురు సాయినాథులు, తాము వేరు కాదని, నిలయం, గుమ్మళంపాడులోని పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధానం శిరిడీతో సమానమని తెలియచేసిన సమర్థ సద్గురు పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లికి శతసహస్ర వందనాలు! వారి సేవాభాగ్యం నాకు నిరంతరం ప్రసాదించమని వారి పాదపద్మములకు అంజలి ఘటించి ప్రార్థిస్తున్నాను!!

ఓం సర్వత్రస్థితాయై శ్రీ అలివేలు మాంగాయై నమః!

జై సాయి మాస్టర్!

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

**శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.**

## 14వ ప్రసంగము

రాఘవ : మాయాపదార్థాలు యందు ప్రేమను విడిచి పెట్టేందుకు నేను ఎంతైనా ప్రయత్నిస్తున్నాను. కానీ మనసు చాలా బలమైనది. ఈ జీవితంలో అది వశమవుతుందా అనిపిస్తుంది.

శ్రీ నిత్యానంద స్వామివారు శ్రీ ప్రకాశానందులవారిని ఈ సందేహాన్ని నివృత్తి చేయమని కోరారు.

స్వా॥ప్ర॥ : యోగవాశిష్ఠంలో వశిష్ఠులవారు చెప్పారు:-

**శ్లో॥ మనో ధావతి సర్వత్ర**
**మదోన్మత్తగజేంద్రవత్।**
**జ్ఞానాంకుశ సమాబుద్ధిః**
**తస్య నిశ్చలతే మనః॥**

భావం : మనసు మదోన్మత్తమైన గజేంద్రుడి లాగా (ఏనుగులాగా) అన్నివైపులా పరిగెడుతుంది. దానికి వివేకజ్ఞానమనే అంకుశము ద్వారా ఏకాగ్రతను కలిగించడం చేత చాంచల్యం పోయి స్థిరత్వాన్ని పొందుతుంది.

రాఘవ : మనసును ఆపే సాధనమేమిటి?

స్వా॥ప్ర॥ : మనస్సే మనస్సును ఆపుతుంది. వజ్రము వజ్రము చేతనే భేదించబడుతుంది (కోయబడుతుంది). లోహాల వలన కాదు. అలానే మనస్సును ఆపేది మనస్సు మాత్రమే!

**శ్లో॥ మనో హి ద్వివిధం ప్రోక్తం**
**శుద్ధం చాశుద్ధమేవ చ।**
**అశుద్ధం కామసంకల్పం**
**శుద్ధం కామవివర్జితమ్॥**

భావం : కార్య శూరత్వం వలన మనస్సు శుద్ధము, అశుద్ధము అని రెండు రకాలు. అందులో మలిన వాసనలతో కూడిన మనస్సు అశుద్ధ మనస్సు అనబడుతుంది. శుద్ధ వాసనలతో కూడిన మనస్సు శుద్ధ మనస్సు.

శుద్ధ మనస్సు సత్త్వ ప్రధానమైనది. అశుద్ధ మనస్సు రజస్తమోగుణ ప్రాధాన్యము కలది. రజస్తమో గుణాలను

తగ్గించి, సత్త్వ ప్రాధాన్యతను పొందిన మనస్సును వశపరుచుకోవచ్చు.

రాఘవ : మనస్సును వశపరచుకోవడానికి సాధనమేమిటి?

స్వా॥ప్ర॥ : శ్రవణ, మనన, నిధి ధ్యాసములు మనస్సును వశపరుచుకొనే సాధనాలు.

రాఘవ : శ్రవణము, మననము చేస్తున్నాను. కానీ నిధి ధ్యాసనమంటే ఏమిటో తెలియడం లేదు. చెప్పండి.

స్వా॥ప్ర॥ : ప్రాపంచికులైన (లౌకికులైన) మానవులు శ్రవణ మననాలు చేయకుండా నిధిధ్యాసనము ఏమి చేయగలరు?

**'బ్రహ్మచర్యాద్వా గృహాద్వా వనాద్వా సంన్యస్య శ్రవణం కుర్యాత్ (శ్రుతి)'**

బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థాల నుండి సన్యాసం తీసుకుని శ్రవణం చేయాలని శృతి చెబుతోంది. గృహస్థాశ్రమం నుండి ఒకేసారి సన్యాసం తీసుకోవడం చేయకూడదు. గృహస్థాశ్రమంలో చేసిన అసంఖ్యాకములైన పాపాల నివృత్తి కోసం వానప్రస్థాన్ని తీసుకొని తపస్సు చేయాలి. తపస్సు చేత సమస్త పాపాలు నశించిన తర్వాత సన్యాసము తీసుకోవచ్చు. వానప్రస్థ ఆశ్రమంలో భార్యాపిల్లలకు అవసరమైన ఏర్పాట్లు చేసిన తరువాతే సన్యాసించాలి. రాజనీతిలో కూడా భార్యాపిల్లల జీవిత నిర్వహణకు పూర్తిగా ఏర్పాట్లు చేసి రాజుగారి అనుమతి తీసుకొని వానప్రస్థాన్ని స్వీకరించాలని చెప్పబడింది.

**పుత్రదారమప్రతివిధాయ ప్రవ్రజతః పూర్వః సాహసదండః।**

భార్యాపిల్లల జీవిత నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయనిదే సన్యసించేవాడికి సాహసదండన విధింపబడుతుంది. అటువంటి సాహసం చేసినవాడు బ్రాహ్మణుడైతే అతనిని రాజు అవమానించి, తల గొరిగించి, గాడిద మీద కూర్చోబెట్టి దేశం నుండి బయటకు వెళ్ళగొట్టాలి. అలా చేసినవాడు బ్రాహ్మణుడు కాకపోతే అతనికి ఖైదు, అంగచ్ఛేదము (శరీరభాగాలను నరికివేయడం), శరీర దండన (శారీరకమైన దండన), ద్రవ్యదండన (ధనం పరిహారంగా తీసుకోవడం) మొ॥న అనేకరకాలైన శిక్షలు నిర్దేశింపబడ్డాయి.

రాఘవ : నాకు భార్యాపిల్లలకు అవసరమైనంత ధనం లేదు. అందువల్ల సన్యాసము తీసుకొనే అధికారము నాకు లేదు. పిల్లలు పెద్దవారయ్యాక అప్పటి పరిస్థితులలో ఆతుర సన్యాసాన్ని* తీసుకుంటాను.

స్వా॥ప్ర॥ : అది ఎంతో మంచిది. ఆతుర సన్యాసం తీసుకుంటే పిల్లలకు తండ్రి తర్వాత చేయవలసిన పనులు చేయడంలో ఇక ఖర్చు తగ్గుతుందనేగా మీ అభిప్రాయం?!

అందరూ ఫక్కున నవ్వారు.

రాఘవజీ భాయి అమాయకుడు. కాబట్టి స్వామివారు ఆయనతో ఇలా వినోదంగా సంభాషిస్తూవున్నారు.

ఆ తరువాత స్వామి శ్రీ ప్రకాశానందులవారు పీఠడియా నుండి వెళ్ళటానికి అవసరమైన ఏర్పాట్లు చేయసాగారు. శ్రీ నిత్యానంద స్వామి వారు ఇలా అన్నారు–

"మీరు ఇక్కడ నుండి వెళ్లిపోవడం ఏమి బాగాలేదు".

స్వా॥ప్ర॥ :

**శ్లో॥ దూరస్థోపి సమీపస్థో**
**యో యస్య హృది వర్తతే।**
**యో యస్య హృదయే**
**నాస్తి సమీపస్థోఽపి దూరగః॥**

భావం : దూరంగా వున్నా హృదయంలో వున్నవాడు దగ్గరగానే వుంటాడు. దగ్గరగా వున్నా హృదయంలో లేనివాడు దూరంగానే వుంటాడు. మీకు నేనంటే ఎంతో ప్రేమ. కాబట్టి నేను ఎప్పుడూ మీ దగ్గరే వుంటాను.

## 14వ ప్రసంగం సమాప్తం

***ఆతుర సన్యాసం** : జీవితాంతం సన్యాసం తీసుకోలేకపోయినా మరణం ఆసన్నమయ్యే దశలో సన్యాసం తీసుకుని సన్యాసిగా మరణించాలనే ఉద్దేశంతో తీసుకునే సన్యాసాన్ని ఆతుర సన్యాసం అంటారు.

# బుద్ధ ధ్యాన హృదయము

(గత సంచిక తరువాయి)

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## అధ్యాయం - 3

### III. మానసిక స్థితిపై ధ్యానము (చిత్తానుపశ్యనము)

ఈ సాధనలో గూడ మనస్సును కేవలశ్రద్ధ అను శుద్ధమైన అద్దము ముందుంచటం జరుగుతుంది. మనస్సుయొక్క లేక చైతన్యము యొక్క స్థితి లేక స్థాయిని అనుక్షణము గుర్తిస్తూండటమే లక్ష్యం.

ఆత్మ పరిశీలన ద్వారా తన మనస్తత్వాన్ని తాను అర్థం చేసుకోగలగడమే యీ సాధన యొక్క ప్రధానమైన ప్రయోజనం. వర్తమానంలోగాని, ముందు క్షణంలోగాని వున్న మానసిక స్థితిని సాధ్యమైనపుడల్లా నిర్లిప్తంగా గుర్తిస్తూండడమే సాధన. ఇది తన మానసిక స్థితిని గురించి యోచించడం, వితర్కించుకోవటంకంటే మెరుగైనది. తన మనస్తత్వాన్ని గురించి యోచించటం, ఆత్మ విమర్శ కొందరిలో అవాంఛనీయమైన పరిణామాలను కల్గించవచ్చు. ఉదాహరణకు ఒకడికి తన దోషాలు తెలియటం వల్ల ఆత్మ విశ్వాసం నశించవచ్చు. ఇందువల్ల సాటివారితో సరిగ మెసలుకోలేడు. మరొకడికి అహంకారం ప్రబలవచ్చు. మరికొందరికి 'నేను ఆత్మ విమర్శచేసుకొనే ఉత్తమ సాధకుడను" అనే గర్వం ప్రబలవచ్చు. కాని నిర్లిప్తంగ (యోచన, విమర్శలేకుండ) తమ మానసిక స్థితిని గుర్తించే వారిలో యిటువంటి లోపాలు నివారించుకోవచ్చు.

చిత్తానుపశ్యనంలో అహంకారంగాని, తనపై తనకు అవిశ్వాసంగాని కలుగక తన యదార్థ స్థితిని గుర్తించి సరియైన సాధనను కొనసాగించే దార్ఢ్యం కలుగుతుంది.

సామాన్యంగా మానవుడు తన బలహీనతలను గుర్తించడానికి, అంగీకరించడానికి యిష్టపడడు. కారణం ఆత్మగౌరవం దెబ్బతింటుందని భయం. ఎప్పుడైనా తప్పక గుర్తించవలసివస్తే తనను తాను యెలాగో సమర్థించుకొని లేక దృష్టిని సాధ్యమైనంత త్వరలో వాటినుంచి మళ్ళించుకో చూస్తాడు. కనుక తన బలహీనతలను అతిక్రమించడమే సాధ్యం కాదు.

అలానే తనలోని సామర్థ్యాలు కూడ కొన్ని తనకే తెలియకుండా వుండిపోతాయి. వాటిని నిర్లిప్తంగా గుర్తించటం వలన సాధనకు ఉపయోగించుకోగలుగుతాడు.

సాధనలో తన పురోగతిని వాస్తవంగ అంచనా వేయడానికి గూడ చిత్తానుపశ్యనం ఉపకరిస్తుంది.

సాధనకు అంతరాయంగా తలెత్తే భావాలను ప్రబలనివ్వకుండా యిది ఉపకరిస్తుంది. ఉదాహరణకు ధ్యానానికంతరాయం కలిగించే శబ్దాలు సాధకునికి చీకాకు పరిచేవనుకోండి. అప్పుడతడు "యిప్పుడు మనస్సు చీకాకు అనే స్థితిలో నున్నది" అని నిర్లిప్తంగా గుర్తించటం వల్ల ఆ చీకాకు అంతరించి ధ్యానాన్ని కాపాడుతుంది. అంతేకాక యీ సాధన ఆ శబ్దము అనే బాహ్యకారణం నుండి తన అంతరంగికమైన చీకాకు మీదికి మరలేలా చేస్తుంది. అంటే అంతర్ముఖం చేస్తుంది.

# IV. మనోవిషయాల ధ్యానము (ధర్మానుపశ్యనము)

ఈ సాధన వల్ల యోచనలన్నీ బుద్ధధర్మానుగుణంగా మారేలా చేస్తుంది. అంటే వాస్తవాన్ని గుర్తించడం ద్వారా ముక్తికి దోహదం చేస్తుంది. కనుక యీ సాధనలోని అయిదు అభ్యాసాలు సత్యదృష్టికి సంబంధించిన యోచనలకు సంబంధించి వుంటాయి. ముక్తి అనే లక్ష్యం వైపుకు మనస్సు మొగ్గేలాగా చేస్తాయి. వీటిని సాధ్యమైనంతవరకు నిత్యజీవిత యోచనాపద్ధతుల్లోకి యిముడ్చుకొని సరియైన అవగాహనను విరుద్ధాలైన భావాలను తోసివేయటానికి వినియోగించుకోవాలి.

మొదటి సాధన అయిదు ప్రధాన మానసిక అవరోధాలను గూర్చినది. నాలుగవది ఏడు జ్ఞానాంశాలకు సంబంధించినది. అంటే యీ రెండభ్యాసాలు విడచి పెట్టదగిన గుణాలకు అలవరచుకోవలసిన గుణాలకు సంబంధించినవన్నమాట. విడచిపెట్టదగ్గ మరికొన్ని లక్ష్యాలు 3వ అభ్యాసంలో సూచించబడతాయి.

ఒకటి, నాలుగవ అభ్యాసాలలో మొదటి భాగాలు కేవలశ్రద్ధ సాధనకు సంబంధించినవి. వాటి సారాంశమిది. ఏదైనా ఒక మానసిక అవరోధం గాని, జ్ఞానం యొక్క అంశంగాని, సాధకుడిలో ఉండడంగాని, ఉండకపోవడంగాని జరిగినప్పుడు ఆ విషయాన్ని కడు స్పష్టంగా గుర్తించాలి. అలాగే మూడవ అభ్యాసంలో యింద్రియానికి, దాని విషయానికి సంఘటన కలిగినందువల్ల యేర్పడిన బంధాన్ని గూర్చినభాగం గూడ కేవలశ్రద్ధా సాధనకు సంబంధించినదే.

పై చెప్పబడిన మూడు సూత్రవాక్యాలు మన ప్రస్తుత చైతన్యస్థితిని చెప్పేవి -నిజానికి చిత్తానుపశ్యనములో భాగాలు. అయితే అవి వాటితరువాత అభ్యాసాలకు అంటే ఆయా అభ్యాసాలలో ఉత్తరభాగాలకు, అత్యావశ్యకమైన సంసిద్ధతనిస్తాయి. ఆ రెండవదశలో ప్రయోజనాత్మకము, కూలంకషము అయిన శుద్ధావగాహనను యీ క్రింది పనులకు ఉపయోగిస్తాము. 1) ఆయా అవరోధాలను బంధాలను నివారించటానికి, తాత్కాలికంగా అతిక్రమించటానికి, చివరకు పూర్తిగా రూపు మాపటానికి. 2) జ్ఞానాంశాలను ఉత్పత్తిచేసి వృద్ధి చెందించటానికి యీ రెండు ప్రయోజనాలను సాధించాలంటే అవరోధాలు, ప్రతిబంధకాలు, అటు జ్ఞానాంశాలు ఉత్పన్నం కావటానికి రాకపోవటానికి దోహదం చేసే పరిస్థితుల గురించి సన్నిహితంగా తెలుసుకోవటమవసరం. మూల సూత్రంలో యీ పరిస్థితులను గూర్చిన విచారణ స్థూలంగా, యీ విధంగా ప్రస్తావించబడింది: "ఏవిధంగా అంతకుముందు ఉత్పన్నం కానివి (అవరోధాలు, బంధాలు, జ్ఞానాంశాలు) ఉత్పన్న కాపడం యెలా జరుగుతుందన్నది అతడు బాగా తెలుసుకుంటాడు."

ఆయా మానసిక అంశాలు ఉత్పన్నం కావటానికి ప్రధానమైన పరిస్థితులు ఆయా సూత్రాలకు బుద్ధఘోషుడు రచించిన వ్యాఖ్యానంలో వున్నాయి. వాటిని కూడా సూచించడమైనది.

అయితే ఆ పరిస్థితులను గూర్చిన సిద్ధాంత పరమైన జ్ఞానమే చాలదు. తనలో ఉత్పన్నమయ్యే అవరోధాలను, బంధాలను, జ్ఞానాంశాలను తనలో వాస్తవంగా గుర్తించడం ద్వారా మాత్రమే బాహ్యంగాను అంతరంగికంగాను వాటిని ఉత్పన్నం చేసేవిగాని, ఆటంకపరచేవిగాని అయిన కారణాలను గూర్చిన పరిజ్ఞానం క్రమంగా లభిస్తుంది. ఈ పరిస్థితులు వ్యక్తికి, వ్యక్తికి మారవచ్చు. సామాన్యంగా యీ గుణాలు, అవగుణాలు ఉత్పన్నం కావడానికి దోహదం చేసే సందర్భాలను వ్యక్తులు పూర్తిగా తెలుసుకోలేరు. తిరిగి తిరిగి వాటిని ప్రయత్నపూర్వకంగా గుర్తించి వాటి పరిచయం కలిగిన వాళ్ళు ప్రతికూలంగా వుండే పరిస్థితులను నివారించి అనుకూలమైన వాటిని కల్పించుకోవడానికి సహకరిస్తుంది. ఇది పురోగతి కెంతో ఉపకరిస్తుంది.

ఒకటవ, నాలుగవ అభ్యాసాలు, మూడవ అభ్యాసంలో రెండవభాగం మనస్సును గూర్చిన పరిజ్ఞానానికి మనస్సుయొక్క అభివృద్ధికి సంబంధించినవి. రెండవ, అయిదవ అభ్యాసాలు, మూడవ అభ్యాసంలో మొదటి అంశము అయిదు విధాలైన తృష్ణ (ఉపాదాన స్కంధము) ఆరు ఆయతనాలకు (యింద్రియాలు), నాలుగు సత్యాలు కలసి వాస్తవాన్ని సంపూర్ణంగా చెబుతాయి. ఒకే సత్యాన్ని ఒక్కొక్కటి ప్రత్యక్షమైన రీతిన ఒక్కొక్క కోణం నుండి చెబుతుంది.

**- సశేషం**

# భగవాన్ శ్రీ భరద్వాజ

శ్రీమతి శ్రీదేవి

## అధ్యాయం - 4

## ఉపనయనం

(గత సంచిక తరువాయి)

భాస్కరాచార్య తన బాబాయి కాలేజీకి వెళ్ళింది మొదలు ఆయన తిరిగి ఎప్పుడు యింటికి వస్తారా అని ఎదురు చూస్తుండేవాడు. భరద్వాజగారు మధ్యాహ్న భోజన విరామ సమయంలో కాలేజీ నుండి యింటికి వచ్చి, బోజనం చేసి మళ్ళీ కాలేజీకి వెళ్ళేవారు. ఆయన రావటానికి ఎంతో ముందుగానే ఆ పిల్లవాడు వీధి గేటులో నిలబడేవాడు. వేసవిలో మిట్టమధ్యాహ్నం తీవ్రమైన ఎండలో యింట్లో వాళ్ళు వారిస్తున్నా వినకుండా బాబాయి కోసం గేటు దగ్గరకు పరుగెత్తేవాడు. ఎండలో చిన్నారి లేతదేహం ఎర్రగా కందిపోతున్నా లెక్కచేయక, వేడిగా వున్న నేలపై కాళ్ళు కాలుతుంటే ఆ పసివాడు గేటు ప్రక్కనే వున్న చిన్న పూలమొక్క నీడలో నిలబడి ఎంతసేపైనా బాబాయి వచ్చే దారివైపే చూస్తూ ఆయన వచ్చేవరకు యింట్లోకి వచ్చేవాడే కాదు. కాలేజీ నుంచి వచ్చిన భరద్వాజగారు ఆ దృశ్యం చూసి ఎంతో బాధతో పరుగున వచ్చి బాబును ఎత్తుకుని లోపలకు తీసుకెళ్ళేవారు.

భరద్వాజగారికి ఆ పిల్లవాడిపై ఎంత మమకారం అంటే కాలేజీ ముగిసిన తర్వాత విద్యార్థులందరూ గ్రౌండ్ కు వెళ్ళి ఆడుకుంటుంటే భరద్వాజగారికి యింట్లో వున్న బాబు గుర్తుకొచ్చి తోటి స్నేహితులతో ఆటలకంటే బాబుతో ఆడటమే ఎంతో యిష్టంగా తోచి, వెంటనే యింటికి వచ్చి బాబుతో ఆడుకునేవారు. భాస్కరాచార్య సాన్నిధ్యమే ఆయనకు లోకంలో అన్నింటికంటే ఆనందదాయకంగా వుండేది. ఆయనకు బాబు తప్ప వేరెవ్వరూ స్నేహితులు కూడా లేరు.

అలా రెండేండ్లు కాలం గడిచిపోయింది, భరద్వాజగారికి యింటర్మీడియెట్ పూర్తయింది.

ముగ్గురు కుమారులకు 8వ ఏట ఉపనయనం చేసిన శ్రీ అనంతాచార్య తమ నాల్గవ కుమారుడైన భరద్వాజగారికి కూడా అదే విధంగా ఉపనయనం చేయ సంకల్పించారు. అయితే “ఉపనయనం ఎందుకు చేసుకోవాలి? దాని ప్రయోజన మేమిటి?” అని ప్రశ్నించారు, జిజ్ఞాసువు అయిన భరద్వాజగారు.

‘నయనం’ - అంటే నేత్రం అని అర్థం. “సర్వేంద్రియాణాం నయనం ప్రధానం” అన్నారు పెద్దలు. అంటే యింద్రియాలన్నింటిలోకీ నేత్రము అతి ముఖ్యమైనది అని నేత్ర ప్రాముఖ్యతను వివరించాయి శాస్త్రాలు. ‘ఉప’ - అంటే అదనంగా మరొకటి అని అర్థం. ‘ఉపనయనం’ - అంటే పంచేంద్రియములలోని కన్నులు కాక అదనముగా యివ్వబడిన మరొక నయనం. అదే జ్ఞాననేత్రం. మనిషిలోని జ్ఞాననేత్రాన్ని మేల్కొలిపి, మానవ జీవితగమ్యమైన మోక్షసిద్ధి వైపు ఆ వ్యక్తిని నడిపింపజేసేదే ఉపనయన క్రతువు. అయితే ఉపనయనం చేసుకున్నవారందరూ జ్ఞానవంతులు, మోక్షగాములు కావాలి కదా! మరి ఎందుకు అవటం లేదు? అలాంటపుడు ఆ క్రతువు యొక్క ప్రయోజనం ఏమిటి?’ అన్న భావాలు భరద్వాజగారిలో మేల్కొన్నాయేమో! ఆయన

ఉపనయనం పట్ల తమ విముఖతను వ్యక్తం చేశారు. సంస్కారవంతుడైన ఆ తండ్రి - శ్రీ అనంతాచార్యగారు కుమారుడి విముఖతను నిరసించక, ఒప్పించే ప్రయత్నం చేయక మౌనం వహించారు.

కొన్ని సంవత్సరాలు గడచిపోయాయి. భరద్వాజగారిలో మరల ఉపనయన క్రతువును గురించిన ఆలోచనలు మెదిలాయి. ఆ క్రతువులోని అంతరార్థం తెలిసికొనాలంటే ఉపనయనం చేసుకొనటం అనివార్యం అని భావించిన భరద్వాజగారు తండ్రికి తమ నిర్ణయాన్ని తెలియజేశారు. అంతే! వెంటనే విజయవాడలోని పేరు మోసిన పండితులు, జ్యోతిష్యులచే ముహూర్తం నిర్ణయించబడింది. అంతటి గొప్ప ఉపనయన ముహూర్తం మళ్ళీ సంవత్సరం దాకా లేదని, కనుక ఈ ముహూర్తానికే ఉపనయనం జరిపించాలనీ నిర్ణయించబడింది.

ఎదురు చూచిన రోజు రానే వచ్చింది. అనంతాచార్యులవారి గృహమంతా రంగు రంగుల రంగవల్లులతో, పచ్చతోరణాలతో అలంకరించబడింది. సంతోషంతో తిరుగాడే బంధుమిత్రులతో, యిల్లంతా కళకళలాడుతున్నది. మంగళ వాద్యాలు మ్రోగుతుండగా, వేదఘోష ప్రతిధ్వనిస్తుండగా ఉపనయన క్రతువుకు సన్నాహాలు ఆరంభమైనాయి.

అదే సమయంలో మరొక చీకటి కోణంవైపు తలుపులు తెరచుకొంటున్నాయి. కానీ ఆ విషయాన్ని బంధువులెవ్వరూ మొదట్లో అంతగా పట్టించుకొనక క్రతునిర్వహణలో నిమగ్నులైనారు. శ్రీ కృష్ణమాచార్యగారి రెండవ కుమారుడు, భరద్వాజగారి ఎనలేని ప్రేమను చూరగొన్న ముద్దులొలికే రెండేళ్ళ పిల్లవాడు భాస్కరాచార్య ఒక గదిలో తీవ్ర జ్వరంతో బాధపడుతూ ఒళ్ళు తెలియకుండా పడుకొని వున్నాడు. విజయవాడలో జరిగే ఉపనయన మహోత్సవానికి హాజరవటానికి శ్రీ కృష్ణమాచార్య కుటుంబంతో సహా ఉపనయనానికి ముందురోజు గుంటూరు నుండి విజయవాడకువస్తుండగాభాస్కరాచార్యకుతీవ్రంగావడదెబ్బ తగిలింది. జ్వరం మగతలో కూడా "బాబాయ్" అంటూ కలవరిస్తున్న ఆ పసివాడి ప్రక్కనే కూర్చొని పిల్లవాడి పరిస్థితికి ఆందోళన చెందుతున్న భరద్వాజగారిని పురోహితులు వచ్చి క్రతువు ఆరంభ మౌతున్నదని, మండపానికి వెంటనే రావలసిందనీ ఎంతగా పిలిచినా ఆయన బాబును వదలి వెళ్ళలేకపోవటంతో పెద్దలంతా కలసి ఆలోచించి, వటువు చేయవలసిన కార్యక్రమాలనన్నింటినీ ప్రత్యామ్నాయంగా పురోహితులు విధానపూర్వకంగా తామే నిర్వహించాలని, క్రతువులో ముఖ్యమైన గాయత్రీ మంత్రోపదేశం మాత్రం భరద్వాజగారు మండపానికి వచ్చి చేయించుకోవాలనీ నిర్ణయించారు.

అయితే పిల్లవాడి పరిస్థితి అంతకంతకూ దిగజారి అందరికీ ఆందోళన కల్గించసాగింది. పిల్లవాడిని చూస్తూ, అతని వద్దనే కూర్చునివున్న భరద్వాజగారి హృదయమెంతో బాధతో ఆక్రోశించసాగింది.

ఉపనయన క్రతువుకు యీ విధంగా ఆటంకం రావటానికీ, పిల్లవాడు అనారోగ్యం పాలవటానికీ కారణం ముహూర్తంలో లోపమేదైనా వున్నదేమోననే అనుమానంతో పండితోత్తములంతా సమావేశమై లగ్నమును మళ్ళీ గుణించి, సరి చూచి, లగ్నములో ఏ లోపమూ లేదని నిర్ణయానికి వచ్చారు. అంతేకాదు ఈ ముహూర్తబలమే పిల్లవాడిని కాపాడగలదని కూడా భావించారు.

చివరకు పెద్దల అభ్యర్థనతో పిల్లవాడిని వదిలి ఉపనయన మంటపం వైపు కదిలారు భరద్వాజగారు. గదినుండి "బాబాయ్! బాబాయ్!" అన్న బాబు పిలుపులు గుండెను పిండివేస్తుంటే కన్నీటితో కదలివెళ్ళి తండ్రి ప్రక్కన గాయత్రీ మంత్రోపదేశానికై పీటలమీద కూర్చున్నారు.

తండ్రి కుమారుని చెవిలో మంత్రోపదేశం చేశారు. భరద్వాజగారు మొదటిసారి మంత్రాన్ని ఉచ్చరించారు. తండ్రి మంత్రాన్ని రెండవసారి చెప్పారు. కుమారుడు రెండవసారి మంత్రోచ్చారణ చేస్తుండగా భాస్కరాచార్య వున్న గది నుండి వెలువడుతున్న ఏదో అలజడి, ఆక్రందనలు గమనించిన భరద్వాజగారు కంగారుగా ఒక్క ఉదుటన పీటలపై నుండి లేచి నిలబడ్డారు. పిల్లవాడున్న గదిలోకి వెళ్ళేందుకు అడుగు ముందుకు వేసేలోపల పురోహితులు ఆయనని క్రిందికి లాగి తిరిగి పీటలపై బలవంతంగా కూర్చోబెట్టగా, తండ్రి మూడవసారి కుమారుని చేత మంత్రాన్ని ఉచ్చరింపజేశారు.

అతిపవిత్రమైన, త్రిగుణాతీతమైన గాయత్రీ మంత్రం ఉపదేశింపబడింది! మహిమాన్వితమైన, మహాశక్తివంతమైన బ్రహ్మోపదేశం జరిగిపోయింది! భరద్వాజగారికి ఉపనయన దీక్ష యివ్వబడింది! ఆయన జ్ఞాననేత్రం విప్పారి ఆయనని మరో మనిషిగా మార్చివేసే ఘట్టానికి తెర తీయబడింది!

అన్యమనస్కంగా మూడవసారి మంత్రోచ్చారణ ముగించిన భరద్వాజగారు బాబు గదిలోనుండి వినిపిస్తున్న

అలజడి విని ఒక్క పరుగున భాస్కరాచార్య వున్న గదిలోకి వెళ్ళి ఆతృతగా అతనివైపు చూస్తే-...

అప్పటివరకు "బాబాయ్! బాబాయ్!" అంటూ కేకలు పెట్టిన భాస్కరాచార్య మంచంపై పడుకుని కనిపించాడు – ఏ విధంగా?

"బాబాయ్! బాబాయ్!" అని అరచిన కంఠం మూగబోయి ఆగిపోయిన నిశ్శబ్దంలో. మూతపడిన కన్నులతో ...... నిశ్చేతనమైన శరీరంతో!

అంతే! ఒక్క క్షణంలో జరిగిందేమిటో అర్థమైంది. అప్పటివరకు తీవ్రమైన అలజడితో, ఆందోళనతో శోకపూరితమై, కల్లోలితమై వున్న భరద్వాజగారి మనస్సు ఒక్కసారిగా నిశ్చలమై పోయింది.

అచేతనంగా పడివున్న బాబును చూస్తూ నిశ్చేష్టుడై నిలబడిపోయారాయన.

కాలం స్తంభించి పోయింది. అలా ఎంతసేపు గడిచిందో తెలియదు.

చాలాసేపటి తర్వాత బాహ్యస్మృతిలోకి వచ్చిన భరద్వాజగారు పెల్లుబికిన దుఃఖంతో జీవంలేని భాస్కరాచార్య శరీరం ప్రక్కనే కుప్పకూలిపోయారు.

తమ పంచప్రాణాలు చిన్నారి బాబుగా తమతో అల్లుకున్న అనుబంధం ఒక్కసారిగా తెగిపోయింది. తమనుండి విడివడిపోయిన ఆ బంధం శాశ్వతంగా తమకు దూరమై అదృశ్యమైపోయింది. భాస్కరాచార్య యిక లేడు. మనసు పొరలలో నుండి చీల్చుకొని వస్తున్న జ్ఞాపకాలకు గుండె నీరవుతుంటే భరద్వాజగారు తల్లడిల్లిపోయారు.

దుఃఖం! దుఃఖం!

ఎంత ఆపుకుందామన్నా ఆగని దుఃఖం!

శోక సముద్రమే అయ్యారాయన!

ఎన్నో సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు, ఎన్నో పగళ్ళు, ఎన్నో రాత్రులు గతించి పోతున్నాయి. కాని కాలం భరద్వాజగారి మనసుకు తగిలిన గాయాన్ని మాన్ప లేకపోయింది. బాహ్యంగా ఏ పని చేస్తున్నా అంతరంగంలో దుఃఖంలో కుమిలిపోతూ కాలం గడపసాగారాయన.

భాస్కరాచార్య తప్ప మరొక ఆలోచనను రానివ్వని మనస్సు స్తబ్దమై, క్రియాశూన్యమై నిలచిపోయింది. తమకు ప్రపంచంతో సంబంధం తెగిపోయింది. బాబు లేని జీవితం, యీ ప్రపంచం నిస్సారంగా తోస్తూ మనస్సు ఏ విషయాల వైపు ఉన్ముఖం కావటం లేదు.

అటువంటి సమయంలో ఒకరోజు బాబు తల్లిదండ్రులైన తమ అన్నావదినెలు బాబును తలచుకొని బాధపడుతుండడం చూచి భరద్వాజగారు నిశ్చేష్టులైనారు. ఆయన హృదయం వారిపై సానుభూతితో నిండిపోయింది. ఆ సన్నివేశం చూసిన తర్వాత యిన్నాళ్ళూ తమను వేధించిన దుఃఖం ఒక్కసారిగా మటుమాయమైంది. అప్పుడు ఆయన హృదయంలో ఉద్భవించిన ఒకే ఒక ప్రశ్న – తామందరినీ ఈ విధంగా శోక సముద్రంలో ముంచిన యీ ఘోరవిపత్తును ఎవరూ అరికట్టలేక పోయిన కారణం ఏమిటి?

మహా తపస్వి అయిన తమ తండ్రిగారు కానీ, అన్నగారి దైవభక్తి, ఉపాసన, ఘనవైద్యుల చికిత్సలు కానీ యీ దుర్ఘటనను ఎందుకని నిరోధించలేకపోయాయి? అన్నింటినీ మించి, భూత భవిష్యత్, వర్తమానాలను తెలియజేసే జ్యోతిశ్శాస్త్రజ్ఞులు, పండితులు, యీ ప్రాణ నిష్క్రమణను ఆపలేకపోయిన కారణం ఏమిటి?

వారు పదే పదే గుణించి గ్రహగతులను సమీక్షించి పెట్టిన శుభ ముహూర్తం, ఆ ముహూర్తబలం ఒక పసివాడి ప్రాణాన్ని ఎందుకు రక్షించలేకపోయాయి?

భరద్వాజగారి అంతఃకరణలో చెలరేగిన ఆలోచనంతా 'ప్రతి ఒక్కరికీ ఏదో ఒకనాడు తారసిల్లే యీ మృత్యువు యొక్క తత్త్వ రహస్యమేమిటి? జీవన్మరణాలకు మూలమెక్కడ?' అన్న అంశంపై కేంద్రీకృతమైంది.

తండ్రిగారి నుండి పొందిన విజ్ఞానం, వేదవేదాంగాల పఠన, నిర్దుష్టమైన ఆలోచన, ఆచరణావిధానం, కార్యసాధన వంటి దైవీగుణాలతో నిండిన ఆయన అసాధారణ వ్యక్తిత్వం యీ విషాదకర సంఘటనకు ఒక ప్రత్యేకమైన, విశిష్టమైన రీతిలో స్పందించింది. ఈ సన్నివేశం సాధారణ మానవుని వలె ఆయనని కృంగదీయలేదు. కాలాంతరంలో బాధను మరచిపోయేలా చేయలేదు. ఆ అసాధారణ ప్రజ్ఞావంతుని మనస్సు సృష్టి మూలతత్త్వాన్ని తరచి, తర్కించి, సత్యాన్ని గ్రహించేందుకు చేసిన అన్వేషణలో జవాబుల కోసం ఆయన ఏ ఆధ్యాత్మిక గ్రంథాలను సమీక్షించలేదు. తమ అత్యంత నిశితమైన అంతఃచక్షువులతో తమకై తామే ఎన్నో విధాలుగా శోధించి తెలుసుకొనేందుకు ఆయనలో యత్నం ఆరంభమయింది.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

శ్రీమతి శ్రీదేవి



కాశీ పట్టణంలోని పండితులను సంప్రదించి వారి అభిప్రాయాన్ని తెలుసుకున్న తర్వాత శశాంకబాబు బృందం అమ్మ సూచించిన గోపీనాథ్ గారిని కలిశారు. మహా మహోపాధ్యాయ పండిత ప్రవర శ్రీయుత గోపీనాథ్ కవిరాజ్ M.A., మహాశయులవారు కాశీలోని పండితుల అందరిలోకి యెక్కువ శాస్త్ర పరిజ్ఞానం, జ్ఞాన సంపత్తి కలవారుగా పేరుగాంచిన గొప్ప వ్యక్తి. ఆయన లోగడ శ్రీ ఆనందమయి మాతను చాలాసార్లు దర్శించి వున్నారు. శ్రీ ఆనందమయి అమ్మను సాక్షాత్తు భగవదవతారంగా ఆయన భావిస్తారు. అమ్మపై ఆయనకు భక్తి ప్రేమలు అపారం. ఆయన అమ్మ ఆదేశం ప్రకారం స్త్రీల వుపనయనం గురించిన శాస్త్ర ప్రమాణాలను మరల పరిశోధించి చూచి తన అభిప్రాయాన్ని యీ విధంగా తెలియజేశారు:

"స్త్రీల వుపనయనం అనేది సమ్మతమేనని శాస్త్రాలన్నీ ధృవీకరించాయి. ఇందుకు ఋషుల ద్వారా వెలువడిన ప్రామాణికాలు కూడా వున్నాయి. ప్రాచీన కాలంలో స్త్రీల వుపనయనాలు నిరాటంకంగా జరిగిపోయేవి. మంత్ర అనుష్ఠానాలు కూడా యథావిధిగా స్త్రీలు ఆచరించగలిగేవారు. నేటి పరిస్థితులు అందుకు అనుకూలంగా లేని మాట నిజమే. అందువల్ల నేడు స్త్రీలకు వుపనయన క్రతువు నిషేధించబడింది."

"అయినప్పటికీ సాక్షాత్తు భగవదవతారమైన శ్రీ ఆనందమయి మాత వంటి మహాత్ములు యేది సంకల్పించినా అది ఆమోదయోగ్యమే! దానిని ఆచరించడానికి శాస్త్రంతో పనిలేదు. అమ్మ స్త్రీలకు వుపనయనం జరపాలని సంకల్పిస్తే యీ కాలంలో కూడా జరిపించవచ్చు. అమ్మ సంకల్పానికి మించిన శాస్త్రం అనేది యేదీ లేదు. ఆమె యేది చేయాలని అనుకుంటే అదే శాస్త్రం. అంతకుమించి వేరే శాస్త్ర ప్రమాణాల అవసరం లేనేలేదు."

కాశీ క్షేత్రంలో యీ విషయానికి సంబంధించిన వివరాలన్నీ శశాంక బాబు అమ్మకు వుత్తరాల దారా తెలియజేశాడు. అప్పుడు అమ్మ మరలా శశాంకబాబుకు యీ విధంగా సమాధానం వ్రాయించారు–

"నిజానికి శాస్త్ర ప్రమాణాలతో అవసరమేమీ లేదు. అయితే నా మనసులో కలిగిన సంకల్పం గురించి యితరుల మనసులలో 'ఇది శాస్త్ర ప్రామాణ్యం అవుతుందా,

లేదా?' అన్న సందేహం వస్తుందన్న వుద్దేశంతో మాత్రమే నేను పండితులను సంప్రదించి, వారి అభిప్రాయాలను తెలుసుకొమ్మని చెప్పాను. మరొక విషయం యేమిటంటే, అందరు స్త్రీలకు యిలా వుపనయన సంస్కారం జరుపమని నేను చెప్పను. ఈ యజ్ఞోపవీత ధారణకు యెవరు అర్హులో వారిని మాత్రమే యెన్నుకోవటం జరుగుతుంది."

శశాంక బాబును యేమి చేయమన్నారో అదే చేశాడు. పండితుల అభిప్రాయాలను తెలుసుకొని అమ్మకు తెలియజేశాడు. అమ్మ ఆజ్ఞను పాటించటం ఒక్కటే అతని కర్తవ్యం. అంతే అమ్మ భక్తులకు అమ్మ సంకల్పం యెటువంటిదైనా అది వారికి శిరోధార్యమే! ఈ ప్రపంచం, ప్రపంచంలోని మనుషులు, వారి అభిప్రాయాలు, శాస్త్రాలు – వీటన్నింటితో వారికి యెటువంటి సంబంధం వుండదు.

ఆ తర్వాత కొన్నాళ్లవరకు యీ విషయమై మరల అమ్మనుండి యెటువంటి ప్రస్తావన రాలేదు. కానీ 1942 వ సంవత్సరం మాఘ మాసంలో అమ్మ బృందంతో పాటు శశాంకబాబు బృందం కూడా తారాపీఠ్ కు రావటం జరిగింది. ఆ సందర్భంలో అమ్మ గురుప్రియకు, అమ్మ పెంపుడు కుమార్తె రమణికి వుపనయనం జరిపించారు.

శ్రీ ఆనందమయి మాత కొన్ని రోజుల తర్వాత డెహ్రాడూన్ నుండి బయలుదేరి కొన్ని ప్రదేశాలు తిరుగుతూ సిమ్లా కొండకు దగ్గరలో వున్న సోలన్ కు వెళ్లారు.

శశాంకబాబు, గురుప్రియ, మనోరమక్క శ్రీ ఆనందమయి అమ్మ ఆదేశం ప్రకారం వింధ్యాచలంలోనే వుంటున్నారు. 1933వ సం॥ చైత్రమాసంలో ఒక రోజు జ్యోతిష్‌దాదానుండి శశాంకబాబుకు ఒక వుత్తరం వచ్చింది. "శశాంక బాబుగారూ, చైత్ర పూర్ణిమలోగా గురుప్రియ దీదీని, మిమ్మల్ని హరిద్వార్ రావలసిందిగా అమ్మ మీకు తెలియచేయమన్నారు. మీరు వచ్చేటప్పుడు దారిలో కాశీలో ఆగి శంకరానంద స్వామిని, మనోరమ దీదీని కూడా వెంటబెట్టుకుని తీసుకురమ్మని అమ్మ చెప్పమన్నారు" అని వ్రాశాడు జ్యోతిష్‌దాదా. ఆ వుత్తరం చూసిన శశాంకబాబు, గురుప్రియల ఆనందానికి అవధులు లేవు. వాళ్ళు వెంటనే కాశీ బయలు దేరారు. కాశీలో మనోరమ, శంకరానంద స్వామిలను కలసి అమ్మ ఆదేశాన్ని వారికి తెలియజేశారు. అందరూ హరిద్వార్ చేరుకుని అమ్మ విడిది చేసిన ధర్మశాలలో అమ్మను దర్శించుకున్నారు. ఒక విశాలమైన ప్రాంగణంలో పెద్ద పెద్ద అందమైన గదులతో నిర్మింపబడిన అతి పెద్ద భవనం ఆ ధర్మశాల. అమ్మ వారందరి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

సంధ్యాసమయంలో శ్రీ ఆనందమయి మాత గురుప్రియను, శశాంక బాబును వెంట బెట్టుకుని గంగాతీరానికి బయలుదేరారు. గంగానదీ తీరాన అక్కడక్కడ కొండరాళ్ళు గుట్టలుగా వున్నాయి. అమ్మ అక్కడ వున్న ఒక పెద్ద కొండ రాయిపై కూర్చున్నారు. గురుప్రియ, శశాంకబాబు అమ్మ యెదురుగా కూర్చున్నారు. శ్రీ ఆనందమయి అమ్మ చెప్పటం ప్రారంభించారు: "శశాంక బాబూ! నేనొక విషయం చెపుతాను. జాగ్రత్తగా వినండి. నేను యేది చెప్పినా, యేది చేసినా అందులో నా ప్రమేయం అంటూ యేదీ వుండదు. నిర్ణయింపబడిన సంఘటనలు నిర్ణయింపబడిన సమయానికి అప్రయత్నంగా జరిగిపోతుంటాయి. ఈ విషయం యిన్నాళ్ళుగా నన్ను చూస్తున్న మీకు యీపాటికి అర్థం అయ్యేవుంటుంది. క్రిందటిసారి పుష్యమాసంలో మిమ్మల్ని డెహ్రాడూన్ పిలిపించాను.(శశాంకబాబు వంక చూస్తూ)అప్పుడే నీకు సన్యాస దీక్ష యివ్వాలని స్ఫురించింది. అయితే అప్పటికి యింకా సమయం కాలేదని అనిపించి యేమీ మాట్లాడలేదు. అప్పుడు నేను నిన్ను కేవలం వస్త్రధారణలో మాత్రం మార్పులు చేయించి, సన్యాస దీక్షకు మానసికంగా సిద్ధం చేయటం జరిగింది. మీరు డెహ్రాడూన్ నుండి వెళ్ళిపోయిన తర్వాత నేను కూడా కొన్ని ప్రాంతాలు తిరుగుతూ సోలన్ కు వచ్చాను. అక్కడ సోలన్ లో కొండపైన వున్న ఒక గుహలో వుండటానికి యేర్పాట్లు జరిగాయి. అయితే ఆ గుహలో ప్రవేశించిన మరుసటి దినమే నిన్ను సన్యాస వేషంలో చూశాను. అప్పుడు తెలుసుకున్నా– సమయం ఆసన్నమైందని! జ్యోతిష్ కు చెప్పి మిమ్మల్ని హరిద్వార్ రావలసిందిగా వుత్తరం వ్రాయించాను. శ్రీ భోలానాథ్ గారికి కూడా చైత్ర సంక్రాంతి రోజున మీరు సన్యాస మంత్రదీక్ష తీసుకోబోతున్నారన్న విషయం వుత్తరం ద్వారా తెలియజేశాను. సోలన్ లో కొన్ని రోజులు వుండేందుకు యేర్పాట్లు జరిగాయి. కానీ, నీకు వుత్తరం వ్రాయించిన వెంటనే నేను హరిద్వార్ వచ్చేసాను. నీవు ఆంతర్యంలో సన్యాసాశ్రమానికి తగిన సంస్కారాలను కలిగివున్నావు. అయితే యీ విషయాలన్నీ యిలా యెందుకు జరుగుతున్నాయో నాకు తెలియదు. జ్యోతిష్ కు కూడా ముందుగా యేమీ చెప్పలేదు. నేనేమీ చేసేది? కావాలని నేను యేమీ చేయను. ఏది జరగవలసివుంటుందో అది జరిగిపోతూ వుంటుంది....." యిలా శ్రీ ఆనందమయి అమ్మ

శశాంక బాబుతో మాట్లాడుతూ వున్నారు. శశాంక బాబు, గురుప్రియ అమ్మనే చూస్తూ అమ్మ మాటలు వింటూ మౌనంగా కూర్చున్నారు. కొన్ని నిమిషాలు గడిచాయి. అమ్మ మరల చెప్పటం ప్రారంభించారు–

"శశాంక బాబూ! హరిద్వార్, లక్ష్మణ్ ఝూలా, ఋషికేశ్ - యిలా పలుప్రాంతాలలో సన్యాసదీక్ష యివ్వగలిగిన యోగ్యులైన వ్యక్తులు యెందరో వున్నారు. మనం ప్రయత్నిస్తే లభిస్తారు. రేపే వారికోసం శంకరానందను పంపిద్దాము" అన్నారు అమ్మ.

శశాంక బాబుకు అమ్మపై గల ప్రేమ అపారం. ఏ వాక్యాలకు, యే పదాలకు, యే భాషకు కూడా ఆయనకు అమ్మపై గల అంకితభావాన్ని వ్యక్తం చేయగల సామర్థ్యం లేదు. శశాంక బాబు ఆనాడు అమ్మ మాటలు వింటున్నాడుగానీ ఆయన మనసులో యేదో అలజడి ప్రారంభమైంది. ఆ దిగ్భ్రాంతిలో కొంతసేపు ఆయన మనస్సు ఆలోచించటం మానివేసి నిశ్శబ్దమైపోయింది. కొంతసేపటి తర్వాత తేరుకొని అమ్మతో యిలా అన్నాడు:

"అమ్మా! మీరు నన్ను యేమి చేయమని ఆదేశిస్తే అదే నాకు శిరోధార్యం. నా జీవితాన్ని మీ చేతిలో వుంచాను. నేను నన్ను మీకు అప్పగించడం కూడా కానేకాదు. ఎంతో దయతో మీకు మీరే యీ బిడ్డను మీ ఒడిలో చేర్చుకున్నారు. సన్యాస దీక్ష గాని, మరి యేదైనా కానీ నా కోసం మీరు యేది చేసినా దానిలో నాకు యెటువంటి అభ్యంతరము వుండదు. నేనేమీ చేయాలో నా అర్హత యేమిటో మీకు మాత్రమే తెలుసు. మీరే నన్ను నడిపిస్తున్నారు. కానీ అమ్మా......" యేదో బాధ మనసును ఆవరించటంతో మధ్యలోనే మాట్లాడటం ఆపివేసి మౌనంగా వుండిపోయాడు శశాంక బాబు. అమ్మ మౌనంగా చూస్తున్నారు.

కొన్ని నిమిషాల తర్వాత, "అమ్మా! మీరు ఒక సాధారణ వ్యక్తిని నాకు గురువుగా యెందుకు నియమిస్తున్నారు? ఇందులోని ఆంతర్యం యేమిటో నాకేమీ తెలియటం లేదమ్మా" అన్నాడు. "తెలియకపోవటం యేముంది? 'నాకై నేను యేమీ చేయను' అన్నది నీకు తెలిసిన విషయమే కదా!" అన్నారు అమ్మ. అమ్మ యేమి చెప్పినా శశాంక బాబుకు వూరట కలగడం లేదు. పైగా ఆయన బాధ రెట్టింపు అయింది. ఎంతో ఆవేదనతో 'అమ్మా! మీకు అన్నీ తెలుసు. నేను మొట్టమొదట మిమ్మల్ని దర్శించినప్పుడే తమకు విన్నవించుకున్నాను నాకు యేది మంచిదైతే అదే చేయమని. నేను యేమి చేయాలో దానిని మీరే నాచేత జరిపించమని ప్రార్థించాను. ఇంతకుమించి నాకేమీ తెలియదు. నా జీవిత నావను నడిపించే బాధ్యత నీదే. నా చేతికి తెడ్డు యిచ్చి మీరే దారి చూపిస్తూ నడిపించండి. మీరు యే దిక్కుకు సాగిపొమ్మంటే అటే ప్రయాణం సాగిస్తాను. మీరు చెప్పినవన్నీ నా శక్తిమేరకు నా చేతనైనంత చేస్తాను. కానీ అమ్మా, నేను నాకు అన్నీ మీరే అనుకున్నాను. కానీ మీరు యిప్పుడు నన్ను యితరుల వద్దకు విసిరి వేస్తున్నారు. ఎందుకిలా చేస్తున్నారు? ఒక సాధారణ వ్యక్తిని గురువుగా స్వీకరించమంటూ నన్ను వారికి అప్పగిస్తున్నారెందుకు? ఈ విధంగా నన్ను యితరుల చేతికి అప్పగిస్తుంటే నేను యెలా భరించగలను? నా సాధనామార్గంలో మీరే నా చేయి పట్టుకొని నన్ను నడిపిస్తున్నారు. ఇప్పుడు మరొకరి జోక్యం యెందుకు? అమ్మా! మీరు తప్ప నేను నడుస్తున్న యీ దారిలో మరొకరు మార్గదర్శకులుగా నాకు అవసరం లేదు. నేను అందుకు అంగీకరించను" అంటుంటే శశాంక బాబు కన్నుల వెంట అశ్రువులు రాలాయి.

"శశాంకబాబూ! నేను యేదైతే చూస్తున్నానో దానినే చేయమని చెబుతున్నాను. సరే నీ వుద్దేశం నీవు చెప్పావు. బాగుంది. నువ్వు యీ విధంగా భావించినట్లయితే యింక యేమీ చేయవలసిన అవసరం లేదు". ఇలా చెప్పి అమ్మ మౌనంగా వుండిపోయారు

సంధ్యా సమయం దాటి అంతటా చీకట్లు అలముకొన్నాయి. అమ్మ, శశాంకబాబు, గురుప్రియ నదీతీరం నుండి ధర్మశాల వైపు వెళ్లిపోయారు.

రాత్రి భోజనాల అనంతరం బంగళా ఆరుబయట అటు యిటు తిరుగుతున్నారు అమ్మ. శశాంకబాబు కూడా యీ విషయమే ఆలోచిస్తున్నాడు. సమయం అర్ధరాత్రి దాటింది. కొంతసేపటికి శశాంక బాబు అమ్మను సమీపించి ఆమెకు నమస్కరించి, "అమ్మా! సాయంత్రం మీరు యేదో నాతో చెప్పిన విషయాలన్నీ విన్న తర్వాత నా మనసులో యెటువంటి భావాలు రేకెత్తాయో అవన్నీ నేను మీతో చెప్పుకున్నాను, అంతే! నన్ను క్షమించండి. నా ఆలోచనలు నా ఆకాంక్షలు యేవిధంగా వున్నప్పటికీ మీరు యేది ఆదేశిస్తే దానిని పాటించడానికి సిద్ధంగా వున్నాను".

- సశేషం

# ద్వారకామాయి అనుభవమండపము

*శ్రీమతి రామరాజు శిరీష, హైదరాబాదు*

నేను టెన్త్ క్లాస్ చదివేటప్పుడు మొట్టమొదటిసారి శిరిడీ కి వెళ్ళాము. అప్పటిలో బాబా విగ్రహాన్ని తాకి నమస్కారం చేసుకునే అవకాశం వుండేది. బాబా దర్శనం చేసుకుని తిరిగి వచ్చిన దగ్గరనుంచి నాకు వారి మీద బాగా భక్తిశ్రద్ధలు ఏర్పడ్డాయి. దాదాపు మా చుట్టాలందరూ శిరిడీ సాయినాథుని భక్తులే. అందరి ఇళ్లలో భజనలు, హారతులు, పారాయణలు జరుగుతాయి.

2019లోజరిగినఒకసంఘటనమీతోపంచుకుంటాను. మా కుటుంబం ఒకసారి కేదార్‌నాథ్ వెళ్ళాం. పహాడ్ అనే చోట హెలికాప్టర్ ఎక్కి కేదార్‌నాథ్ వెళ్లాలి. అది ఎన్నికల సమయం అవడంవల్ల, రాజకీయనాయకుల రాకతో మాకు హెలికాప్టర్ మధ్యాహ్నం 3గంటలకి యిచ్చారు. పొద్దున దర్శనానికి వెళ్లి మళ్లీ సాయంత్రం వెనక్కి వచ్చేయాలని మా ప్రణాళిక. కానీ మేము అక్కడికి వెళ్ళేసరికి ఆలస్యమయింది. రాత్రికి అక్కడే ఉండిపోవలసిన పరిస్థితి. టెంపరేచరు మైనస్ డిగ్రీలలో వుండడం వల్ల చలి విపరీతంగా వుంది. ఆ రాత్రికి ఎక్కడ వుండాలి? బయట టెంట్లు ఏర్పాటు చేసినా అక్కడ ఉండగలమా అని ఆలోచిస్తూ, ఏదైనా దారి చూపించమని బాబాని మనసులో ప్రార్థిస్తున్నాను. పైకి మా అమ్మాయితో "బాబా దయవల్ల ఇప్పుడెవరైనా వచ్చి మనకి ఈపూట వుండటానికి ఏదైనా రూము ఇస్తే బాగుండును" అన్నాను. అప్పుడు మా అమ్మాయి "భలేదానివమ్మా, ఇక్కడ మనకి ఎవరు తెలుసు, రూము ఇవ్వడానికి? అన్నింటికి బాబా సహాయం చెయ్యాలంటావ్" అన్నది. దర్శనం క్యూ చాలా పెద్దగా ఉంది. ఇంతలో ఒకాయన మా దగ్గరకి వచ్చి, "మీకు వుండటానికి రూము కావాలా?" అని అడిగాడు. కావాలని చెప్పాము. మావారు అతనితో వెళ్ళి రూము చూసి వచ్చారు. దర్శనం అయ్యాక మమ్మల్ని రూములో వదిలి, మర్నాడు తెల్లవారు ఝామున 3గంటలకి సిద్ధంగా వుంటే స్పర్శ దర్శనం చేయిస్తానని చెప్పి వెళ్లారు. అనుకున్నట్టుగానే మర్నాడు ఉదయమే వచ్చి స్పర్శ దర్శనానికి తీసుకెళ్లారు. అతను దగ్గరుండి అన్నీ చూపించారు. తిరుగు ప్రయాణంలో బస్సులో మిగిలిన వాళ్లందరూ, "మీరెంత అదృష్టవంతులండి! చక్కటి రూము దొరికింది, మాకు టెంట్ లో చాలా ఇబ్బంది అనిపించింది, పైగా మీకు స్పర్శ దర్శనం కూడా దొరికింది" అని అన్నారు. అప్పుడు మా అమ్మాయి, "నువ్వన్నది నిజమే అమ్మా, బాబా దయవల్లే ఇదంతా జరిగింది" అంది. నాకు తెలుసు ఇదంతా ఆ సాయినాథుని అనుగ్రహమేనని!!

2020 లో మావారికి ఉద్యోగవిరమణ సమయం. వారు స్టడీ సర్కిల్ లో డైరెక్టర్ గా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారు. 58 సంవత్సరాలు పదవీవిరమణ వయస్సు. అయితే అప్పటి ప్రభుత్వం పదవీ విరమణ సమయం పెంచుతామని చెప్పారు. కానీ అది ఇంకా అమలులోకి రాలేదు. మాకు ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. వాళ్ల బాధ్యతలు తీరకుండా రిటైరు అవుతారని కొంచెం దిగులుగా వుండేది. ప్రతిరోజూ బాబాతో ఇదే విషయం చెప్పి బాధ పడేదాన్ని. ఆగస్టు నెలలో ఒకరోజు ఒకతను సాయిరాం, సాయిరాం అని పెద్దగా అరుస్తున్నాడు. మేము మేడమీద వుంటాము. నాకు అతని అరుపు వినిపించి

11రూపాయలు దక్షిణ పట్టుకుని క్రిందకి వచ్చి అతన్ని చూసి ఆశ్చర్యపోయాను, చాలా చక్కటి ముఖవర్చస్సుతో, బాబా వేషధారణలో వున్నారు. నమస్కారం చేసి దక్షిణ ఇచ్చాను, వెంటనే ఆయన హిందీలో,,,"మీ సమస్య బాబాకి తెలుసు, మీకు తొందరలోనే ప్రభుత్వం నించి డబ్బులు వస్తాయి" అన్నారు. అప్పుడు నాకు, 'మావారు రిటైర్ అవ్వడం తప్పదు' అనిపించింది. వెంటనే అతను, "మీకొక ఉద్యోగం కూడా చూసి పెట్టాను" అన్నారు. నేనిక ఏదో ఆలోచించుకుంటూ వెళ్లబోతుంటే, "మీ ఇంటికి ఒకరోజు వచ్చి భోజనం చేస్తాను" అన్నారట, ఆ మాట నా పక్కనే ఉన్న ఒకమ్మాయి విని నాకు చెప్పింది. నేను ఆశ్చర్యపోయాను, ఎందుకంటే ప్రతి గురువారం ఎవరికైనా భోజనం పెడదామని అనుకునేదాన్ని. కానీ ఇక్కడ ఎవ్వరూ దొరకరు, నా మనసులో మాట చెప్పడమే కాదు, మా ఇంటి పరిస్థితి కూడా చెప్పారు,,, వారెవరై ఉంటారన్న ఆలోచన నాకు రాలేదు.

తరవాత మావారితో "మీరు సెప్టెంబరులో ఉద్యోగవిరమణ చెయ్యడం ఖాయం, నాకు బాబా సందేశం వచ్చింది" అన్నాను. మావారు, "కాదు ప్రభుత్వం సమయం పెంచుతుంది" అన్నారు. సెప్టెంబర్ 30కి మావారు ఉద్యోగ విరమణ జరిగింది. తరవాత,,,ఆరోజు అతను చెప్పినట్లుగానే మాకు రావలసిన డబ్బులన్నీ వచ్చాయి. అయితే, ప్రభుత్వం రెండు సంవత్సరముల కాలపరిమితి పెంచుతూ అదే ఉద్యోగంలో మావారిని తిరిగి తీసుకున్నారు. "మీకు ఉద్యోగం చూసి పెట్టాను" అన్నది కూడా నిజమయ్యింది. మరి ఆరోజు భిక్షకి వచ్చినాయన సాక్షాత్తూ సాయినాథులు కాక ఇంకెవరు?

2023 లో మేము శిరిడీ వెళ్ళాము. పిల్లలిద్దరూ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కానీ ఇంకా వివాహాలు కాలేదు. ఆవిషయం నన్ను చాలా కలత పెట్టేది. ఇంక నాకు దిక్కెవరు? ఆ సాయినాథులే కదా, శిరిడీకి వెళ్ళి మొరపెట్టుకుందామని ప్రయాణం పెట్టాను.

మేము శిరిడీ చేరిన రోజు ఉదయం ఒక హోటల్లో టిఫిను చేసి బయటికి వచ్చేసరికి, మా దగ్గరకి ఒక పూజారి వచ్చాడు. అతన్ని నేను రోజూ శిరిడీలో జరిగే ఆరతి ( టి.వీ. లో లైవ్)లో చూస్తాను. నేను ఆయనని గుర్తుపట్టి నమస్కారం చేశాను. ఆయన మాతో, "మీ సమస్య బాబాకి తెలుసు. ఈరోజు 'పోల' అమావాస్య(మహారాష్ట్రలో వ్యవసాయానికి సంబంధించిన పండుగ), చాలా మంచిరోజు. ఇప్పుడు మీరు నెయ్యి తీసుకుని ద్వారకామాయి ధుని లో సమర్పించండి" అని హిందీలో చెప్పి, నాతో కొంచెం గట్టిగా 'దక్షిణ కుక్షన ఏమైనా ఇస్తావా?' అన్నారు. నేను ఒక వంద రూపాయలు ఇచ్చి నమస్కారం చేసుకున్నాను. ఆయన వెళ్ళిపోయారు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది, సమాధి మందిరంలో సేవ చేసే పూజారిగారు మాకు తారసపడటం, వారిని నేను గుర్తుపట్టడం, వారు మా సమస్య పరిష్కారంచెప్పడం,,, ఇదంతా బాబా లీల అనిపించింది. మేము ముందుగా బాబా సమాధి మందిరానికి వెళ్ళి దర్శనం చేసుకుని, తరవాత రెండు ప్యాకెట్లు నెయ్యి తీసుకుని ద్వారకామాయికి వచ్చాము. అక్కడకి వచ్చేసరికి మధ్యాహ్న హారతి జరుగుతోంది. హారతి అయ్యాక కొంతసేపటికి మేము ధునికి నమస్కారం చేసుకుని అక్కడి వారితో మాకు ఏవో సమస్యలు వున్నాయని, ధుని తలుపులు తెరిస్తే నెయ్యి సమర్పిస్తామని అడిగాము. వారు, "ఇప్పుడు తెరవడం కుదరదు" అని చెప్పారు. ''అయ్యో ధునిలో నెయ్యి వేయకపోతే మా సమస్యలు తీరవేమో' అని నాకు ఏడుపు వచ్చింది. వారు ఏమనుకున్నారో ఏమో కొంతసేపటికి కొద్దిగా తెరిచి ఒక ప్యాకెట్ నెయ్యివేసి, ఇంకొకటి తరవాత వేస్తామన్నారు. నేను హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుని, సాయినాథునికి మనసారా కృతజ్ఞతలు తెలియచేసుకున్నాను.

తరవాత 3గంటలకి మళ్ళీ దర్శనానికి వెళ్ళాము. ఆరోజు పోల అమావాస్య సందర్భంగా బాబా దగ్గర ఆవుబొమ్మలు, బండి మొదలైనవి అలంకరించారు. అక్కడ బాబాపాదుకలకి నేను నమస్కరించుకోగానే నాకొక్కదానికే అక్కడి పూజారి(నాకు కనిపించిన అతను కాదు) స్వీటు ప్రసాదంగా ఇచ్చారు. అంతేకాదు, పక్కన నిలబడి కొంతసేపు దర్శనం చేసుకోమ్మని చెప్పారు. అప్పుడు నాకు మనసులో నిశ్చయమైంది, త్వరలోనే మా పిల్లల పెళ్ళిళ్లు జరుగుతాయని. ఆ యాత్రలో బాబా ఇచ్చిన ఆశీస్సులవల్ల వెంటనే పిల్లలిద్దరి పెళ్ళిళ్లు జరిగిపోయాయి.

ఇలా ఎన్నో, ఎన్నెన్నో సందర్భాలలో బాబా కరుణ, కృపాకటాక్షాలు, మాకు అనుభవం అవుతూనే ఉన్నాయి.

ఓం సమర్థ సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై!!

జై సాయి మాస్టర్!

# ఆచార్యుని అద్భుత లీలలు

**శ్రీ వెంకట రమణయ్య**

పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ లీలా వైభవాన్ని నెల్లూరు జిల్లా, విరూరు కి చెందిన శ్రీ వెంకట రమణయ్య గారు ఈ విధంగా తెలియజేస్తున్నారు.

1977 సంవత్సరంలో మా ఊరికి బాల గురవయ్య అనేవారు రికార్డు అసిస్టెంట్ గా ఉద్యోగం చేయడానికి వచ్చారు. వారికి నేను రోజు సాయంత్రం త్రాగే నీళ్ళు తీసుకెళ్లి ఇచ్చేవాణ్ణి. అలా వెళ్తున్న సందర్భంలో వారి దగ్గర బాబా ఫోటో చూసి వివరాలు అడిగాను. నేను అప్పుడు ఏడవ తరగతి చదువుతున్నాను. వారన్నారు, "ఈయన



చాలా గొప్ప మహాత్ముడు. ఈయనని పూజించే వీరి శిష్యుడు ఎక్కిరాల భరద్వాజ గారు చాలా గొప్పవారు. వారు ఐఏఎస్ చదివి ఉద్యోగ అవకాశం వచ్చి కూడా దాన్ని వదిలేసి, శిరిడి సాయినాథుని సేవిస్తూ విద్యానగర్ లో ఇప్పుడు అధ్యాపకులుగా పనిచేస్తున్నారు" అని చెప్పారు. నాకు ఆ చిన్న వయసులో, 'కలెక్టర్ ఉద్యోగం అంటే చాలా గొప్పది కదా! దాన్ని వదిలేసి బాబాని పట్టుకుని ఉన్నారంటే వారెంత గొప్పవారు?' ఒకసారి చూడాలి అనిపించి, వారి వివరాలు అడిగితే విద్యానగర్ వారింటి అడ్రస్ ఇచ్చారు. నేను అప్పుడు పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారికి ఒక ఉత్తరం రాసాను. "నేను వస్తున్నాను, మిమ్మల్ని చూడాలి, మీరు నాకోసం ఉండాలి" –ఇట్లు బోడెద్దుల వెంకట రమణయ్య, జెడ్పీ హైస్కూల్, ఏడవ తరగతి, విరూరు.

ఇలా ఉత్తరం రాసిన మూడు నాలుగు రోజుల తర్వాత విద్యానగర్ వెళ్ళాను. బస్టాండు లో దిగిన తర్వాత అక్కడ వారిని అడిగితే, పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి దారి చూపించారు. వెళ్లి గుమ్మంలో నిలుచున్నాను, ఉదయం సమయం అది. వారు ఆ గదిలో కొంతమందితో మాట్లాడుతున్నారు. నన్ను చూసి లోపలకి రమ్మనట్టు సైగ చేశారు. నేను లోపలకి వెళ్లి, గోడకానుకుని మూలకి కూర్చున్నాను. ఆ సంభాషణలు ఏమీ నాకు అర్థం కావట్లేదు. కలెక్టర్ ఉద్యోగం మానేసిన ఆయన్ని చూస్తూ కూర్చున్నాను. ఇంతలో పోస్ట్ వచ్చింది. పూజ్యశ్రీ మాస్టరుగారు అక్కడున్న వారికి అప్పుడువచ్చిన ఉత్తరాలు చదివి వినిపిస్తూ, "భరద్వాజ్ గారు, నేను వస్తున్నాను, మీరుండాలి, మిమ్మల్ని చూడాలి"అని రాసిన ఉత్తరం చదివి, "ఆ నేను నీ కోసమే ఉన్నాను" అని సమాధానం ఇస్తుంటే, నేను నెమ్మదిగా లేచి, అది రాసింది నేనే సార్" అన్నాను.

అక్కడున్న వారందరూ గట్టిగా నవ్వారు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరు గారు, "మన తపాలా శాఖ ఎంత గొప్పదో చూడండి, ఉత్తరం కన్నా మనిషి ముందు వచ్చాడు" అన్నారు. అది పూజ్యశ్రీ మాస్టరుగారితో నా తొలి పరిచయం.

ఆరోజు అలా రాత్రి వరకు అక్కడే ఉండిపోయాను. ఆ రాత్రి నేను, కొంతమంది సత్సంగ సభ్యులు నిర్మాణంలో ఉన్న సాయిబాబా మందిరంలో పడుకున్నాము. మరునాడు ఉదయం మా ఊరికి బయలుదేరుతూ మళ్లీ ఎందుకో మాస్టరుగారి దగ్గరికి వెళ్లాలనిపించింది. ఉదయం 7, 8గంటల మధ్యలో వారి దగ్గరికి వెళ్లాను. అప్పుడు వారు ఒక్కరే ఉన్నారు. నన్ను పక్కన కూర్చోబెట్టుకుని చాలా ఆప్యాయంగా మాట్లాడారు. అప్పుడే నాతో "సత్సంగాలు చేయవోయ్ మీ ఊరిలో" అన్నారు. నేను ఆశ్చర్యపోయాను అప్పుడు అది ఏంటో కూడా నాకు తెలియదు. తర్వాత, నాకు లోపల ఎంతో ఆత్రుతగా అడిగేయాలి అన్న ప్రశ్న వారి ముందు ఉంచాను. "మాస్టరు గారు! కలెక్టర్ అంటే చాలా గొప్పది కదా, ఐఏఎస్ చదివిన మీరు ఎందుకు ఈ ఊర్లో ఇలా ఉండిపోయారు?" అని అడిగాను. వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారు పక్కనే ఒక చాక్ పీస్ ఉంటే అది నా వైపు విసిరి "నేల మీద ఐఏఎస్ అని రాయవోయి" అన్నారు. నేను I A S అని రాశాను. వెంటనే వారు, "దాన్ని తిరగేసి రాయవోయ్" అన్నారు. S A I అని రాసాను. "నువ్వనుకున్నట్లు నేను IAS దాటలేదోయ్" అన్నారు. దాని అర్థం ఏమిటో కొంచం పెద్దయ్యాక తెలిసింది.

కాలంతరంలో M.A., చేసి, B.Ed. చేశాను. ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డాను. నా శ్రీమతి కూడా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలు. ఇవన్నీ జరుగుతున్నా మళ్లీ పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనం చేసుకోవాలని ఆలోచన నాకు రాలేదు. కొన్నాళ్ళు వారి దగ్గరుండే దామోదర్ తో ఉత్తరప్రత్యుత్తరాలు జరిపాను. అతను పోయాక అవి ఆగిపోయాయి. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్టు నేను ఎక్కడుంటే అక్కడ సత్సంగాలు చేసుకున్నాను. సత్సంగంలో పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు పారాయణ చేసుకుని, అది పూర్తి అయిన వెంటనే చుట్టుపక్కల వాళ్ళని పిలిచి అన్నదానం నిర్వహించడం, కొన్ని ముఖ్యమైన ఉత్సవాలు పూజ్యశ్రీ మాస్టరుగారి జయంతి, ఆరాధన, గురుపూర్ణిమ, దత్త జయంతి లాంటివి అందరం కలిసి ఉత్సాహంగా జరుపుకోవడం, అప్పుడు జరిగే అన్నదాన కార్యక్రమాలలో ఎన్నో అనుభవాలు పొందడం మాకు పరిపాటి. కొంతమందికి అని వండిన ఆహార పదార్థాలు అనుకోకుండా ఎక్కువ మంది వచ్చినా సరిపోయేవి. ఊహించని విధంగా మహాత్ములు వచ్చి భిక్ష చేయడం జరిగింది. ఇప్పటికీ ప్రతి గురువారం ఒకొక్కరి ఇంట్లో తప్పకుండా సత్సంగం నిర్వహించుకుంటూ నా చిన్నతనంలో పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు అప్పగించిన కార్యక్రమం, వారి ఆశీస్సులతో దిగ్విజయంగా కొనసాగుతూనే ఉంది.

నాకు మొట్టమొదట బాబు పుట్టాడు. అనుకోని పరిస్థితుల్లో కొద్ది రోజుల్లోనే ఇంకా హాస్పిటల్ లో ఉండగానే బాబు మరణించాడు. నాకు మనసంతా వికలమైపోయింది. మాస్టరుగారు బాబా చాలా గొప్పవాడు అని చెప్పారు, నేను కూడా నమ్మాను కానీ ఇలా ఎందుకు చేశారు? అని బాధపడుతున్న సమయంలో,, ఎవరో "బాబా పిచ్చివాడు, ఆయన అందరి మీద రాళ్లు విసురుతూ కోపంగా తిడుతూ పరిగెడుతూ అలా ఉండేవాడట, నువ్వు నమ్ముకున్న బాబా పిచ్చివాడు అన్నారు. మా బాబు పోయాక నాక్కూడా బాబా మీద అటువంటి అభిప్రాయం కలిగింది. అప్పుడు ఒక రోజు పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్న దర్శనమిచ్చి, నా భుజం మీద చేయి వేసి నా పక్కనే నడుస్తూ "బాబా పిచ్చివాడు కాదు, సాయిని విమర్శించవద్దు" అన్నారు, అప్పుడు స్వప్నంలోనే, "పిచ్చివాడు కాదని అంత గట్టిగా మీరు ఎలా చెప్పగలరు" అని అడిగాను, అప్పుడు పూజ్యశ్రీ మాస్టరు గారు, "ఇప్పుడు నేను నీతో ఎలా మాట్లాడుతున్నానో, వారితో కూడా అలాగే మాట్లాడతాను" అని చెప్పి అంతర్ధానం అయిపోయారు. ఇక అప్పటినుంచి బాబాని దైవంగానే భావిస్తున్నాను. పైగా అది నా గురుదేవుల ఆజ్ఞ, నేను బాబాను విమర్శిస్తే వారు బాధపడతారు అన్నది నాకు అర్థమైంది. తరవాత నాకు నలుగురు సంతానం కలిగారు.

ఒకసారి స్వప్నంలో,,,, పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక ఇంటి పైన డాబా మీద కూర్చుని ధ్యానం చేసుకుంటున్నారు. నేను చూస్తుండగానే వారు గాలిలోకి లేస్తున్నారు. నేను వెంటనే వారి పాదాలు పట్టుకున్నాను మేమిద్దరం ఆకాశంలో ప్రయాణం చేస్తున్నాం. కింద కొండలు లోయలు చెట్లు

అన్ని వెళ్లిపోతున్నాయి. ముందుగా నన్ను అహోబిలం తీసుకువెళ్లారు అక్కడ దర్శనం చేయించి, తర్వాత కల్లూరు తీసుకువెళ్లారు. తర్వాత శ్రీశైలం దర్శనం చేయించి అంతర్ధానమైపోయారు. వారు నాకు ఏమేం చేయాలనుకున్నారో స్వప్నాల ద్వారా చాలా జరిపించారు. ఇంకొక సంఘటన ఏమిటంటే, ఏప్రిల్ 12వ తేదీన నేను రైల్లో ప్రయాణం చేస్తున్నాను తెల్లవారుజామున 5:00 కి నాకు ఒక స్వప్నం వచ్చింది. నా ఎదురుగుండా ఒక బ్లాక్ బోర్డు ఉంది దాని మీద పైవరుసలో అందరూ మహాత్ముల ఫోటోలు, క్రింది వరుసలో  దేశ నాయకుల ఫోటోలు ఉన్నాయి ఈరెండు వరసల మధ్యలో పూజ్యశ్రీ మాస్టరు గారి ఫోటో ఉంది. దీని అర్థం ఏమిటి అని స్వప్నంలోనే ఆలోచిస్తున్నాను. ఇప్పుడు చూస్తున్న వారందరూ దేహం వదిలేసిన వాళ్లే పొరపాటున పూజ్యశ్రీ మాస్టరు గారు కూడా శరీరం వదిలేస్తారా అన్న ఆలోచన వచ్చి, ఉలిక్కిపడి లేచాను. 'ఇలా అనిపించిందేంటి?' అని బాధపడ్డాను. తర్వాత ఇల్లు చేరాము. ఆరోజు సాయంత్రం ఏడు గంటల సమయంలో మాఊరి పాఠశాలలో పనిచేస్తున్న క్రాఫ్ట్ మాస్టరుగారు నాకు ఎదురుపడి "ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారు వెళ్లిపోయారు" అని చెప్పారు. నేను నమ్మలేనట్టు తరచి తరచి వివరము అడిగాను, ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో రేడియోలో ఈ వార్త వచ్చింది, అని చెప్పారు. నేను నిలువునా కృంగిపోయాను. అప్పుడు నా చుట్టూ ఉన్న పరిస్థితుల కారణంగా చివరి దర్శనానికి కూడా వెళ్లలేక పోయాను. తర్వాత చాలా కాలానికి పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరకి ఒంగోలు వెళ్లి, నేను పూజ్యశ్రీ మాస్టరుగారిని చిన్నప్పుడు దర్శించుకున్న దగ్గరనుంచి, ఇప్పటిదాకా జరిగినవన్నీ ఏకరువు పెట్టి, ఒక బిడ్డ లాగా తల్లి దగ్గర అన్నీ చెప్పుకున్నాను.

2017 ప్రాంతంలో నేను కొలిమెర్ల ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నప్పుడు, నాకు క్లాసు లేనప్పుడు, ప్రయోగశాల(లాబ్)లో కూర్చుని పారాయణ చేసుకోవడం అలవాటు. అలాగే ఆరోజు 'శ్రీ సాయిమాస్టరు స్మృతులు' పారాయణ చేసుకుంటున్నాను. అకస్మాత్తుగా చల్లిగాలి వీచింది. వర్షం పడుతోందా అనిపించి బైటికి చూసాను. ఈలోపు పూజ్యశ్రీ మాస్టరుగారు తెల్ల పంచ, చొక్కా వేసుకొని ఆ పంచ కొంగు చేత్తో పట్టుకొని ఎదురుగా ప్రత్యక్షమయ్యారు. లోపలి నుంచి 'గురుదేవా' అని పిలవాలనిపిస్తోంది. కానీ పిలువలేకపోతున్నాను.  పూజ్యశ్రీ మాస్టరుగారు తరంగాల రూపంలో గది అంతా వ్యాపించారు. ఇది స్వప్నం కాదు. బాహ్యంలో నా గురుదేవులు నాకొసగిన చక్కటి అనుభూతి!!

2021 నవంబర్ నెలలో నేను పదవీ విరమణ చేశాను. అప్పటినించి పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్నంలో చాలా సార్లు, "ఏమోయ్ టైము అయిపోయింది వచ్చేయ్" అంటున్నారు. నేను పూజ్యశ్రీ మాస్టరుగారిని, "ఇప్పుడే కదా స్వామి పదవీ విరమణ చేశాను, కొంతకాలం ప్రశాంతంగా గడపాలి కదా, కనీసం ఒక సంవత్సరం అయినా సమయం ఇవ్వండి" అని అడిగాను. అయితే ఒకరోజు స్వప్నంలో ఒక తేదీ చెప్పి, 'ఆరోజు వచ్చేయాలి' అన్నారు, స్వప్నం ముగిసింది. సరే పుట్టిన తర్వాత ఎప్పుడైనా వెళ్లి పోవాల్సిందే కదా అనుకున్నాను.. ఒకరోజు స్వప్నంలో,,, ఎడ్ల బండిమీద ఒక పెద్ద వాగు దాటుతున్నాను, నీటి ఉధృతి చాలా ఎక్కువగా వుంది. ఎలా దాటాలో తెలియటం లేదు. కొట్టుకుపోవడం ఖాయం అనుకున్నాను. ఎదురుగా పూజ్యశ్రీ మాస్టరుగారు ప్రత్యక్షమై, "ఏంట్రా  ఎటు పోతున్నావ్" అని అడిగారు. నా దగ్గర సమాధానం లేదు. వెంటనే వారు నాకు చెయ్యి అందించి, బండి నుంచి దింపేశారు. 'హమ్మయ్య' అని ఊపిరి తీసుకున్నాను. ప్రాణాపాయం నించి రక్షించారు అనిపించింది.

తర్వాత చూసుకుంటే పూజ్యశ్రీ మాస్టరుగారు, నన్ను వచ్చెయ్యమన్న రోజునే ఈ స్వప్నం వచ్చింది. అంటే శ్రీగురుడు లాగా నా తలరాతని మార్చి, ఈ జీవితాన్ని ప్రసాదించారు.

ఇలా ఏమీ తెలియని ఒక పల్లెటూరి అబ్బాయిని ఆధ్యాత్మికంగా, లౌకికంగా, ఉన్నతస్థాయికి తీసుకువచ్చిన పూజ్యశ్రీ మాస్టరుగారితో ఋణానుబంధం ఏనాటిదో!! వారి పరిచయం నా జీవితానికి అర్థాన్నిచ్చింది. ప్రత్యక్షంగా సంబంధాన్ని కొనసాగించకపోయినా, నా మనసులో గురుదేవుని స్థానాన్ని గుర్తెరిగి నన్నునుగ్రహిస్తున్న నా స్వామికి కృతజ్ఞతా పూర్వక నమస్సుమాంజలులు!! ●

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

**శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

**శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

**ఇతర మహాత్ముల గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ  స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

**అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు**

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

**ధ్యాన సంబంధమైన గ్రంథములు**

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

**ఆధ్యాత్మికత - తత్వచింతనా పూర్వక గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

**ఇతర గ్రంథములు**

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

**పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ<br>(రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి<br>(సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

**బాలల కొరకు విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

**BOOKS IN ENGLISH**

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master<br>*(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

**BOOKS IN OTHER LANGUAGES**

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |

**సాయంకాల కార్యక్రమములు**

గం॥ 6:30 - **'శ్రీ నళినీప్రియ కూచిపూడి నృత్య నికేతన్', ఒంగోలు వారిచే 'శ్రీ శిరిడీ సాయి దివ్య చరితం' నృత్య రూపకం ప్రదర్శన.**

గం॥ 9:00 - శేజ్ హారతి.

గం॥ 9:30 - ప్రసాద వితరణ.

## మార్చి 7, 2025 శుక్రవారం

**ఉదయ కార్యక్రమములు**

గం॥ 5:30 - మేలుకొలుపు సేవ.

గం॥ 6:00 - శ్రీ సాయిబాబా కాకడ ఆరతి.

గం॥ 7:30 - పూజ్యశ్రీ అమ్మగారి సమాధి అభిషేకము, ప్రత్యేక అలంకరణ.

గం॥ 8:30 - అల్పాహార నైవేద్య సేవ.

గం॥ 9:00 - ప్రసాద వితరణ.

గం॥ 10:00 - **శ్రీ సాయిమాస్టర్ నిత్య సత్యవ్రతము**

గం॥ 12:30 - మధ్యాహ్న హారతి.

గం॥ 1:00 - భోజన ప్రసాద వితరణ.

**సాయంకాల కార్యక్రమములు**

గం॥ 5:00 - గురుకుటుంబంతో ఇష్టాగోష్ఠి.

గం॥ 9:00 - శేజ్ హారతి.

గం॥ 9:30 - ప్రసాద వితరణ.

## మార్చి 8, 2025 శనివారం

*పూజ్య గురుపత్ని సమాధి వద్ద జరుగు నిత్య సేవలు నిర్ణీత సమయాలలో యథావిధిగా జరుగుతాయి.*
*అల్పాహార ప్రసాద వినియోగ అనంతరము ఈ క్రింది ప్రత్యేక కార్యక్రమం వుంటుంది.*

గం॥ 10:00 - **పూజ్య భరద్వాజ గురుదేవులచే విరచితమైన -**
**'ఏది నిజం ?' 'మతం ఎందుకు ?' మరియు 'శ్రీ సాయినాథ ప్రబోధామృతము' గ్రంథాల సమన్వయం.**
**- గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారిచే సత్సంగము.**

*గ్రంథ సమన్వయ సమీక్షా సమావేశం మధ్యాహ్న భోజన ప్రసాద వినియోగ అనంతరం కూడా కొనసాగుతుంది.*

## మార్చి 9, 2025 ఆదివారం

*పూజ్య గురుపత్ని సమాధి వద్ద జరుగు నిత్యసేవలు నిర్ణీత సమయాలలో యథావిధిగా జరుగుతాయి.*
*అల్పాహార ప్రసాద వినియోగ అనంతరము ఈ క్రింది ప్రత్యేక కార్యక్రమం వుంటుంది.*

గం॥ 10:00 - **'నిత్యజీవితంలో సాధన' - గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారిచే సత్సంగము.**

గం॥ 12:30 - మధ్యాహ్న హారతి

గం॥ 1:00 - భోజన ప్రసాద వితరణ, **కార్యక్రమముల ముగింపు**

*కళ్యాణ మహోత్సవమునకు విచ్చేయు భక్తులకు వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేయబడినవి.*
*వివరములకు :- శ్రీ ఆర్.ఎస్. శశిధర్ గారు (98496 45573).*

**Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.**
**Printed and published by Dr. R.S. Sasidhar on behalf of E. Vikramaditya and printed at Vanaja Printers, Vijayawada and published at Sri Manga Bharadwaja Trust, Ongole (523002) - Editor: Dr. R.S. Sasidhar.**
**Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.**



# పూజ్య గురుదంపతుల లీలా కళ్యాణ మహోత్సవము

మన గురుదంపతుల కళ్యాణ మహోత్సవము జరిగి 50 సంవత్సరాలు పూర్తయిన కారణంగా వారి కల్యాణ మహోత్సవ రజతోత్సవ వేడుకలు 'శ్రీ అలివేలుమంగమ్మ దివ్యసన్నిధానము' లో విశేష కార్యక్రమములతో మార్చి 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలలో భక్తులందరూ పాల్గొని గురుదంపతుల కృపాశీస్సులు పొందవలసిందిగా ప్రార్థన!